ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ENTERED

Entered

సెప్టెంబర్ 12, 2010

వన్‌గ్రామ్ మెరుపుల్ !

హ్యాపీ బర్త్‌డే

(2010 సెప్టెంబర్ 12 నుంచి 2010 సెప్టెంబర్ 18 వరకు)

కీర్తిప్రియ
గీత-రఘు
ఖమ్మం

జూటూరి మింటు
మంజులత-కూషల్
ఆనోనిపల్లి-మహబూబ్‌నగర్



వై. తేజస్
నాగమణి-తిరుపతి
కృష్ణలంక-విజయవాడ

కె. స్పందన
అనురాధ-వెంకటేష్
సుందరయ్యకాలనీ-నెల్లూరు

ఎల్. రుత్విక
కరుణ-వీరారెడ్డి
ఖమ్మం

బి. సహస్ర
అనిత-బి. సురేంద్రరెడ్డి
పెనుమాక-గుంటూరు

ఎన్. నిఖిల్
పార్వతి - అర్జున్
విశాఖపట్నం

ఎం. మోక్షసాయి(నానీ)
సృజనక్రాంతి-చెన్నకేశవులు
కావలి-నెల్లూరు

కె. శ్రీమన్నారాయణరెడ్డి
మాధవి-మహేశ్వరరెడ్డి
రాజీవ్‌నగర్-కర్నూల్

ENTERED

మనలో మాట

నయనం ప్రధానం

మానవ శరీరంలో కంటికి ఇచ్చే ప్రాధాన్యత కూసింత ఎక్కువే. అందుకే సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. ఏం చేయాలన్నా ముందు పని తగిలేది కళ్లకే. మన మాటల్లో...పాటల్లో...ఆటల్లో...ఆఖరుకు సినిమాల్లో సైతం కళ్లది ప్రత్యేక స్థానం. ఎవరైనా గర్వంగా, తలబిరుసుగా ప్రవర్తిస్తే...'వాడికి ఈ మధ్య కళ్లు నెత్తికెక్కాయిలే' అంటాం. చూసుకోకుండా ఎవరిదైనా కాలు తొక్కినా, ఎవరినైనా ఢీకొన్నా వెంటనే 'ఏం కళ్లు కనిపించట్లా...' అనేస్తాం కోపంగా. ఇంకొందరైతే 'కళ్లు ఎక్కడ పెట్టుకొని నడుస్తున్నావ్ బాసూ' అంటారు కామెడీగా. ఏదైనా అపురూపమైన దాన్ని కాపాడుకోవాల్సి వచ్చినప్పుడు కంటిపాపలా చూసుకోవాలని చెప్తుంటాం. పురాణాల్లో సైతం అదనపు నేత్రాలున్న దేవతలకు ప్రత్యేక స్థానం వుండేది. కనుబొమల మధ్య మూడో కన్ను వున్న శివుడు, వంటి నిండా నేత్రాలున్న ఇంద్రుడు ... ఆ కోవకు చెందినవారే. కేవలం ధృతరాష్ట్రుడు అంధుడు కావడం వల్లే మహాభారత సంగ్రామం జరగాల్సి వచ్చిందనే వారూ వున్నారు. అంధులైన తల్లిదండ్రులను కావడిలో పెట్టుకొని సేవలు చేసి కుమారుడంటే అలా వుండాలి అన్న పేరు కొట్టేశాడు శ్రవణుడు. వేటగాడైన భక్త కన్నప్ప గురించి నేటికీ పురాణాల్లో చదువుకుంటున్నామంటే కారణం తన కంటిని శివలింగానికి సమర్పించుకోవడమే. ఈ కథతో వచ్చిన 'భక్త కన్నప్ప' సినిమా సైతం సూపర్ డూపర్ హిట్టు. ఇక అంధులే ప్రధాన పాత్రధారులుగా వచ్చిన సినిమాలు ఒకటా రెండా! కంటి సెంటిమెంటు చిత్రాలను తీయడంలో అటు టాలీవుడ్ ఇటు బాలీవుడ్ రెండూ పోటీపడ్డాయి. హమ్‌కో తుమ్‌సే ప్యార్ హై, బ్లాక్, ఫనా, చిరంజీవులు, ప్రేమించు, కళ్లు, శీను వాసంతి లక్ష్మి...మచ్చుకు కొన్ని మాత్రమే. ఇక ఓ తెలుగు సినిమాలో హీరోగారు 'కంటి చూపుతో చంపేస్తా' నంటూ శత్రువును హెచ్చరించే డైలాగ్ యమా పాపులరైపోయింది. సినిమాల్లో కళ్ల మీద వచ్చిన పాటలు అన్నీ ఇన్నీ కావు.

మన జీవితాల్లో ఇంతటి ప్రధాన పాత్ర పోషిస్తున్న కళ్లు రెండు జీవితకాలాల పాటు మనగలగడం ప్రకృతి వరప్రసాదమనే అనుకోవాలి. మనం చనిపోయాక కూడా ఈ కళ్లు లోకాన్ని చూడగలవంటే...భూమిమీద మనుగడ సాగిస్తుంటే...ఈ జన్మ సార్ధకమైనట్టే. అది నేత్ర దానంతోనే సాధ్యమౌతుంది మరి. కానీ అంతటి అపురూపమైన కళ్లను మనం మూర్ఖంగా మనతోపాటే తీసుకెళుతున్నాం. మట్టిలో కలిపేస్తున్నాం. ఈ విషయంలో తన కళ్లను, దేహాన్ని దానం చేసిన కమ్యూనిస్టు కురువృద్ధుడు జ్యోతిబసు ఎందరికో మార్గదర్శి. పట్టణాలు, నగరాల్లో సైతం అరుదుగానైనా నేత్రదానం చేసేవారి గురించి వింటుంటాం. అయితే ఒక మారు మూల గ్రామస్తులంతా తమ కళ్లను దానం చేయడమంటే చిన్న విషయం కాదు. అది మన రాష్ట్రంలో...రాజధానికి కూతవేటు దూరంలో వున్న రంగారెడ్డిజిల్లాలో జరిగింది. ఆ గ్రామమే దేవుని ఎర్రవెల్లి గ్రామం. నిన్నమొన్నటి దాకా కుగ్రామంగా పడివున్న ఆ చిన్ని పల్లెటూరు ఇవాళ ఒక్కసారిగా పత్రికల్లో ప్రధాన వార్తగా రావడానికి కారణం నేత్రదానమే. గ్రామంలో వున్న 2200 మంది తమ మరణానంతరం కంటిని దానం చేయడానికి ముందుకొచ్చారు. చదువుసంధ్యలు అంతగా లేకపోయినా దృష్టిలేనివారికి చూపు నివ్వాలన్న వారి సంకల్పబలం గొప్పది. ఆదర్శవంతమైనది. చనిపోయాక కూడా సమాజానికి ఉపయోగపడేలా తమ కళ్లను దానం చేసిన వారంతా అభినందనీయులు. మార్గదర్శులు.

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
క్రైమ్‌కథ	...	10
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కొత్త పుస్తకాలు	...	20
నవ్వుల్ పువ్వుల్	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

కొత్త కిటికీలు తెరిచిన 'ఓల్గా సే...'

సినిమా ... 8

అదిరేటి కాంబినేషన్లు...

కథ ... 18

శ్వేత మనోగతం





అలరించిన వెనిస్

29-8-2010 స్నేహ సంచికలో లాహిరి లాహిరిలో వెనిస్ విషయాలు అలరించాయి. అంతా జలమయంలో వెనిస్ మహానగరంలో చిన్న చిన్న నావలపై ప్రయాణం... అక్కడి చర్చిలు, కార్నివాల్ విశేషాలు చదవవలసినవే.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

వాస్తవ ప్రతిబింబాలు 'అద్దె బతుకులు'

ఈ వారం దమ్మారో... మహమ్మారో... ముఖచిత్ర కథనం యువతకు మంచి హెచ్చరిక చేసింది. 'అద్దె బతుకులు' కథ వాస్తవంగా వుంది. గ్లోబలైజేషన్ పేరిట సెజ్‌ల రూపంలో రైతన్న ఎలా సర్వం కోల్పోతున్నాడో వివరించింది. కవితలు ఆలోచింపచేసేలా వున్నాయి. 'శుభం' కథ చిన్నారుల కోసమే అయినా పెద్దవాళ్లకి సైతం నచ్చుతుంది. శకునం పేరిట మూఢనమ్మకాల జోలికి వెళ్లకుండా ప్రయత్నలోపం లేకుండా పట్టుదలతో ఉద్యోగమయినా సాధించుకోవచ్చుననే విషయం కనువిప్పు కలిగిస్తుంది. 'వెనిస్' నగర అందచందాలని చదివి తనివితీరా ఆనందించాం. 'కథలకు ఆహ్వానం' నన్ను మరింతగా మురిపించింది.

సాహిత్య ప్రకాష్, హైదరాబాద్.

బాలనేస్తాలు బావుంది

దమ్మారో...మహమ్మారో వ్యాసం బాగుంది. ఎంతో ఘనచరిత్ర కలిగిన మన రాజధాని హైదరాబాద్ నేడు మాదకద్రవ్యాల అక్రమ సరఫరాకు నిలయంగా మారింది. పెరుగుతున్న నగరంతోపాటే చీకటి వ్యవహారాలు శరవేగంగా పెరిగాయి. ఇక అద్దె బతుకులు కథ నేటి సామాజిక వాస్తవ పరిస్థితులకు నిలుటద్దం. 'సరస్వతి' కథ ఎంతో బాగుంది. కథ చిన్నదైనా అందించిన సందేశం మాత్రం పెద్దదే. స్ఫూర్తిలో మార్గం చూపిన మార్టి, మార్పుల గురించి క్యూబా యోధుడు కాస్ట్రో చెప్పిన సంగతులు-బాగున్నాయి. సెంటర్ పేజీలో వెనిస్ అందాల గురించిన సమాచారం ఎంతో బాగుంది. 'పునఃప్రవేశంలో పునర్వైభవాలు' ఎంతో బాగుంది. రెండు సంవత్సరాల, తర్వాత వస్తే అప్పట్లో రీ ఎంట్రీ అనేవారు. మరి మన యువహీరోలు నేడు ఒక సినిమా షూటింగ్‌కే రెండు సంవత్సరాలు పడుతుంది. దీన్ని ఏమని పిలవాలి? రెండు పేజీల్లో బాలనేస్తాలు శీర్షిక ఎంతో బాగుంది. చివరి పేజీలో ఇల్లు ఇలా కూడా కూరగాయల ఆకారంలో కట్టిన ఇళ్ళు చూసి ఎంతో ఆశ్చర్యపోయాము.

మార్టూరు అజయ్‌కుమార్, చిలకలూరిపేట.

ఆలోచింపచేసిన 'నాస్తికుడు'

ఆగస్టు 15 సంచిక ఆద్యంతం రమణీయం, కమనీయం. ఈవారం ప్రతి ఒక్క అంశం దేనికదే, ప్రత్యేకతను సంతరించుకుంది. ముఖ్యంగా ఈవారం అట్టమీద కథ "మరలిరాని మన సంపద"లో అలనాటి అపురూప చారిత్రక వస్తువుల గురించిన ఎంతో ముఖ్య సమాచారాన్ని, ఆయా చిత్తరువుల ద్వారా పాఠకులకు అందించడం మాకెంతో ఆనందాన్నిచ్చింది. చూడాలనే ఆశ, స్వాహా తంత్రం అనే కవితలు, వాటి సారాంశం ఎంతో వాస్తవంగా వున్నాయి. కెమెరా కథలో కెమెరా చరిత్రను పూర్తిగా వివరించినందుకు ధన్యవాదాలు. 'నాస్తికుడు' కథ ఆలోచింపచేసింది. 'నవ్వుల్-పువ్వుల్'లో ప్రతి జోక్ నవ్వింపచేసి మా ఇంటిల్లిపాదిని ఆకట్టుకున్నాయి. ఇంత చక్కని శీర్షికలు ప్రచురిస్తున్నందుకు మా ధన్యవాదాలు.

టి.వి.డి.ఎన్. సీతారామారావు, విజయవాడ.

కథ ఆసక్తిగా సాగింది

ఆగస్టు 29 స్నేహలో ప్రచురించిన అట్టమీదకథ ద్వారా మాదక పదార్థం 'డ్రగ్స్' గురించి వివరంగా ఇచ్చారు. అద్దెబతుకులు కథ తీరు చాలా బాగుంది. మాటలకోట అందిస్తున్న సుబ్బారావుగార్కి కృతజ్ఞతలు. సినిమా కబుర్లు కూడా ఆసక్తిగా వున్నాయి. పూర్వం చదువు సంధ్యల్లేని రాముడు, రంగడు లాంటి పాత్రలు అమాయకంగా, ఆత్మీయంగా అలరించేవి. ఏదైనా, ఒక సినిమా హిట్ అయితే అలాంటి కథలతో అనేక సినిమాలు రావడం పరిపాటి. బాలనేస్తాలులో చీమ జిరాఫీతో మాట్లాడిన తీరును బాగా చిత్రీకరించారు.

అనుపోజు సంతోషి నాగరాజు, విజయనగరం.

మత్తు విపత్తు

ప్రేక్షకుల ఆదరణను బట్టి, నటుల అదృష్టాల్ని బట్టి వారి నటనా వైభవం సాగుతుంది. కమ్మని రవ్వ దోశ కర కరా తింటూ, టమోటా బాత్‌కు ఆర్డరు యిచ్చి పొట్టనింపుకుంటారు. అంతర్జాతీయ కృషితో వెనిస్ వన్నె తగ్గకూడదు. మత్తు విపత్తు బాగా రాశారు. రంగులు పులిమే బొమ్మలు బాగున్నాయి. ఇల్లు ఇలా కూడా బాగుంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, హైదరాబాద్.

'శేష ప్రశ్న' స్ఫూర్తితో...

శరత్ 'శేషప్రశ్న' పరిచయం అద్భుతం. ఎప్పుడో చదివిన దాన్ని తిరిగి చదివింపచేశారు. కమల పాత్ర ...జీవితం పట్ల దృక్పథాన్ని, సొంతంగా ఆలోచించడానికి, చదవడానికి ప్రేరణ ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అలాగే స్వాహాతంత్రం నేటి ప్రభుత్వాల పనితీరును చక్కగా తూర్పారబట్టింది.



కెమెరా కథ, సినిమా కబుర్లు చాలా బావున్నాయి. వ్యాయామం వాయిదా పడుతోందా...లో చక్కటి సూచనలిచ్చారు. పాటించదగినవిగా వున్నాయి. మాటలకోట మెదడుకు పదునుపెడుతోంది. మొత్తానికి ఆదివారంకోసం ఎదురుచూసేలా స్నేహను ఇస్తున్నందుకు ధన్యవాదాలు.

జగదీష్ దాస్, మాధవధార, విశాఖ.

యూత్ చదవాల్సిన 'దమ్మారో...'

ఈవారం కవర్ స్టోరీ 'దమ్మారో.. మహమ్మారో...' నేటి యువత తప్పనిసరిగా చదవాలి. మాదకద్రవ్యాల రాకెట్‌కు పోలీసు అండదండలు వుండబట్టే సజావుగా సాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాలలో ఫారెస్ట్ పోలీస్ అధికారుల అండదండలతో గంజాయి సాగు యదేచ్ఛగా కొనసాగుతోంది. మొన్నటిదాకా బాలీవుడ్‌కే పరిమితమైన మాదకద్రవ్య వ్యాపారం నేడు టాలీవుడ్‌కూ వ్యాపించింది. సినీనటులు రాజకీయ నాయకులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు గంజాయి, భంగు వగైరాలకు బానిసలవుతున్నారు. కొకైన్, హెరాయిన్, బ్రౌన్‌సుగర్ వగైరాలు విదేశాల నుండి దిగుమతి అవుతున్నా ప్రభుత్వ శాఖలు నిద్రపోతున్నాయి మరి.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం.

★

కల్లు అమ్మడానికే...

గుర్రాలను ఎవరు ఉపయోగిస్తారు? మహా అయితే కథల్లో చదివిన రాజులు, సైన్యం, దోపిడీ దొంగలు. కానీ... గుర్రం మీద కల్లు అమ్మినవారి గురించి విన్నారా ఎప్పుడైనా? అయితే విషయంలోకి వెళ్లిపోవాల్సిందే.



అశ్వాన్ని అధిరోహించిన తాత పేరు మధగోని అనంతయ్య. నల్గొండ జిల్లా కేతిపల్లి గ్రామం. తాత వయసు 80 దాకా వుంటుంది. కుల వృత్తిగా కల్లు అమ్ముతుంటాడు. చూశారుగా. అదీ గుర్రం మీద. ఈ సంప్రదాయం తాతల కాలం నుంచి వుంది. దాన్ని అనంతయ్య కూడా ఫాలో అయిపోతున్నాడు. ఈయనగారు వయసులో వుండగా ఎంత మొనగాడి తాడినైనా ఎక్కేసి కల్లు గీసేవాడంట. అయితే వయసు పైబడి ఇప్పుడు కుదరడంలేదనుకోండి. తాత కుటుంబ విషయాల దగ్గరకొద్దాం. ఆయనకు నలుగురు అమ్మాయిలు. అబ్బాయిలు లేరు. వారందరికీ పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపించేశాడు. ఎనిమిదేళ్ల కిందట మహారాష్ట్రలో కొన్న ఈ గుర్రమే ఆయనకు తోడుగా మిగిలింది. కల్లు గీసే కుర్రోళ్ల దగ్గర కల్లు కొని కేతిపల్లిలో అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. కంటి చూపుకూడా అంతంత మాత్రమే. గుర్రమే లేకపోతే ఈ పని చేయడం కూడా కష్టమే అయ్యేది పాపం. తన తండ్రి అచలు, తాత రామయ్యకు కల్లు తీయడంలో మాంచి పేరుందని చెప్తాడీ తాత. మొత్తం జీవితకాలంలో డజను గుర్రాలకుపైగా ఉపయోగించినా...ఈ సంప్రదాయం తనతోనే అంతరించి పోయేట్టుందంటాడు. జీవిత చరమాంకంలో కూడా ఇతరుల మీద ఆధారపడకుండా ఇప్పటికీ సొంతంగా కల్లు అమ్ముకొని బతకడం తమలాంటి వారికి కూడా స్ఫూర్తిదాయకంగా వుందని గ్రామంలోని యువకులు అంటుంటారు.

తెలుసా!



బాబోయ్ ఎప్పటి బూటు!

'మనం నాగరికులం కాబట్టి బూట్లు వేసుకుంటున్నాం' అనుకుంటారేమో! అంతా తుస్సే. వేల సంవత్సరాల కిందటే తోలు బూట్లు వాడారు తెల్సా. అబ్బో అప్పటి బూటంటే ఎంత రోతగా వుంటుందో అనుకోమాకండి. ఈ ఫొటోలో కన్పిస్తున్న లెదర్ బూటు చాలా పాతది. దాదాపు 5,500 సంవత్సరాల కిందటిది. అమెరికాలోని ఒక గుహలో ఈమధ్యే బయల్పడింది. మరి ఇన్ని ఏళ్లబట్టి చెడిపోకుండా ఎలా వుందీ! అనుకుంటున్నారా? గొర్రె పేడ కింద నిక్షేపంగా వుంది. ఈ బూటు మొత్తం ఒకే ఒక తోలు ముక్కతో చేసింది. ఏడవ నంబర్ బూటు. కాకపోతే మహిళలదో, పురుషులదో మాత్రం తెలీలా. బూటు లోపల నిండుగా గడ్డి కుక్కి వుంది. బహుశా బూటు ఆకారం పాడవకుండా కావచ్చు. లేదా బూటును వెచ్చగా వుంచడానికైనా కావచ్చు. ఇప్పుడు కూడా కొత్త బూట్లలో ఏవేవో కాగితాలు కుక్కి పెడతారు కదా. అంటే మనం ఇప్పుడు వాడుతున్న బూట్లకు, దీనికి పెద్ద మార్పులేం వచ్చినట్టు కనబడదు.

రోబో 'నోబీ'

మీరు ఇప్పటివరకు ఎన్నో రకాల రోబోల గురించి విని వుంటారు. చూసి వుంటారు. కానీ ఈ బొమ్మలో కనిపించే రోబో రూటే వేరు. ఎలాగంటారా? దీన్ని జపాన్ పరిశోధకులు రూపొందించారు. ఎందుకంటే... పసిపిల్లలుగా వున్నప్పుడు మానవుల ఎదుగుదల ఎలా వుంటుందనేదానిమీద అధ్యయనం చేయడానికి. దీని కురచ పేరు 'నోబీ'. పూర్తి పేరు 'నైన్ మంత్ ఓల్డ్ బేబీ'. వినడానికి, చూడ్డానికి, స్పర్శజ్ఞానం కోసం... దీని తలలో 600 రకాల కనెక్షన్లు ఏర్పాటు చేశారు. నోబీ ఎత్తు 71 సెంటీమీటర్లు. బరువు 7.9 కేజీలు. చూడ్డానికి నిజంగా తొమ్మిదినెలల బాబులా వుంటుంది. దీని చర్మం మృదువుగా వుంటుంది. మామూలు పిల్లవాడు మాదిరిగా కదలడానికి వీలుగా శరీరభాగాల మధ్య జాయింట్లు ఏర్పాటుచేశారు. మొత్తంమీద పరిశోధకులు దీనిని మానవాభివృద్ధి అధ్యయనానికి ఉపయోగిస్తున్నారు. "పరిసరాలు, మానవుల కదలికలు, చర్యలకు నోబీలో ఎలాంటి స్పందనలు కలుగుతున్నాయో తెలుసు కోవచ్చు. దీన్ని నిజమైన పిల్లల స్పందనలతో పోల్చి చూడవచ్చు" అని టోక్యో యూనివర్సిటీ ప్రొఫెసర్ యోసో కునియోషి చెప్తున్నారు.



స్ఫూర్తి

-దేవీప్రియ,
ప్రముఖ కవి, సంపాదకులు.

కొత్త కిటికీలు తెరిచిన 'ఓల్గా సే...'

సామాన్య కుటుంబంలో పుట్టిన నాకు అంతకు ముందు సాధారణ కుతూహలం తప్ప సమాజం గురించిన సమగ్రావగాహన అబ్బే అవకాశమే లేదు. కనకనే 'ఓల్గా సే గంగా' చదివాక 70 ఎంఎంలో మానవ చరిత్రను చూసిన అనుభూతి కలిగింది. ఆ పుస్తకం నన్నెంతగా ప్రభావితం చేసిందంటే చాలా కాలం పాటు దాని గురించే ఆలోచించేవాణ్ని. తర్వాత కూడా దాన్ని చదవమని ఎంతోమందికి చెప్పివుంటాను. ఇప్పటికీ చెబుతుంటాను.

తర్వాత నన్ను బాగా ఆకట్టుకున్న పుస్తకం తెన్నేటి సూరి 'చంఘీజ్ ఖాన్'. ఆ పుస్తకం చదివిన తర్వాత వుత్సాహంతో వూగిపోయాను. అంతకు ముందు 'చంఘీజ్ ఖాన్' అంటే దురాక్రమణదారుడు, నర హంతకుడు అనే అభిప్రాయం వుండేది. కాని ఈ పుస్తకం చదివిన తర్వాతనే అతని చారిత్రిక నేపథ్యం తెలిసింది.

నేను చిన్నప్పటినుంచి పుస్తకాలు చదవడం ఎక్కువే. అలాగే సినిమాలు కూడా బాగా చూసేవాణ్ని. ఆ విధంగా వూహాశక్తి, సృజనశీలత పెంచుకుంటుండేవాణ్ని. అయితే నా ఆలోచనలకు కొత్త కిటికీలు తెరచి ప్రపంచాన్ని సరికొత్తగా చూడటం నేర్పించిన పుస్తకం చెప్పమంటే మొదటగా గుర్తుకు వచ్చేది రాహుల్ సాంకృత్యాయన్ రాసిన 'ఓల్గా సే గంగా'.

గుంటూరు జిల్లా తాడికొండలో స్థానిక గ్రంథాలయంలో ఆదుర్దాగా పుస్తకాలు చదివేస్తుండేవాణ్ని. ఏది దొరికితే అది చదివి అదేపనిగా ఆలోచిస్తుండేవాణ్ని. అలాంటి సమయంలోనే నాకు 'ఓల్గా సే గంగా' దొరికింది. అందులో దేశ దేశాలలో ఆదిమ కాలంతో మొదలు పెట్టి వివిధ దశల్లో వివిధ భూ ఖండాల్లో జరిగిన పరిణామాలను సమాజ పురోగమనాన్ని కథాత్మకంగా వర్ణించడం చూసి ముగ్ధుడినైపోయాను. అది నా ఆలోచనా పరిధిని అపారంగా విస్తరించిందని చెప్పగలను. చరిత్రకు వాస్తవిక దృష్టితో కూడిన కల్పనను జోడించిన రాహుల్జీ మానవ మహా ప్రస్థానాన్ని కళ్లకు కట్టేలా మహత్తరంగా దాన్ని తీర్చిదిద్దారు. అంతకు ముందు నాకు అలాంటి విషయాలే తెలియవు. 'ఓల్గా సే గంగా' చదివిన తర్వాతనే నేను మానవ సమాజ గమనంలో దశలుంటాయని తెలుసుకోగలిగాను.

సామాన్య కుటుంబంలో పుట్టిన నాకు అంతకు ముందు సాధారణ కుతూహలం తప్ప సమాజం గురించిన సమగ్రావగాహన అబ్బే అవకాశమే లేదు. కనకనే 'ఓల్గా సే గంగా' చదివాక 70 ఎంఎంలో మానవ చరిత్రను చూసిన అనుభూతి కలిగింది. ఆ పుస్తకం నన్నెంతగా ప్రభావితం చేసిందంటే చాలా కాలం పాటు దాని గురించే ఆలోచించేవాణ్ని. తర్వాత కూడా దాన్ని చదవమని ఎంతోమందికి చెప్పివుంటాను. ఇప్పటికీ చెబుతుంటాను.

తర్వాత నన్ను బాగా ఆకట్టుకున్న పుస్తకం తెన్నేటి సూరి 'చంఘీజ్ ఖాన్'. ఆ పుస్తకం చదివిన తర్వాత వుత్సాహంతో వూగిపోయాను. అంతకు ముందు 'చంఘీజ్ ఖాన్' అంటే దురాక్రమణదారుడు, నర హంతకుడు అనే అభిప్రాయం వుండేది. కాని ఈ పుస్తకం చదివిన తర్వాతనే అతని చారిత్రిక నేపథ్యం తెలిసింది. ఎక్కడో ఎడారి సీమల్లో పుట్టిన ఈ మంగోల్ వీరుడు మహా సామ్రాజ్యాలనే గజగజలాడించిన తీరు ఎవరికైనా ఉత్సాహమిస్తుంది. ఆ ప్రపంచ విజేత ప్రస్థానం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నంత ప్రగాఢమైన ముద్ర వేసింది. కఠోర సవాళ్ల మధ్యనా కార్యదీక్షను సజీవంగా వుంచుతుంది. అది చదివాకే నాకు మనిషి సాహసానికి, శౌర్యానికి పరిమితులు లేవని అర్థమైంది. ఆ తర్వాత చంఘీజ్ఖాన్పై వచ్చిన చాలా పుస్తకాలు చదివాను. అనేక చిత్రాలు చూశాను. బహుశా వాటన్నిటిలోకి ఒమర్ షరీఫ్ చంఘీజ్ ఖాన్గా నటించిన చిత్రం బాగా ప్రసిద్ధి. ఇప్పటికీ ఆయనపై చిత్రాలు పుస్తకాలు వస్తూనే వుంటాయి. చంఘీజ్ ఖాన్పై రాసిన కవిత కూడా నా సంపుటాలలో చూడొచ్చు.

మాది పేద ముస్లిం కుటుంబం. చిన్నతనంలో అమ్మ ఖసీదాలు రాసి పాడుతూ తప్పెట కొట్టే ఫకీర్లతో పాడిస్తుండేది. నాకు ఆ విధంగా బాల్యంలోనే కళాత్మక చైతన్యం వచ్చింది. తర్వాత గ్రంథాలయాల్లోనూ అదేపనిగా చదువుతూ గడిపాను. చిన్నప్పుడు స్కూలులో చదివే రోజుల్లో గుర్రపు బండిలో కూర్చుని బగ్గీ తోలడం నేర్చుకున్నాను. అప్పుడే గుర్రపు డెక్కల చప్పుడుకు అనుగుణంగా పాట కట్టడం అలవాటైంది. 1966-67 ప్రాంతాల్లో తెనాలి వివిఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతూ మా కాలేజీ మ్యాగజైన్లో కొన్ని రచనలు చేశాను. తర్వాత గుంటూరు ఏసీ కాలేజీలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి, స్ఫూర్తిశ్రీ వంటి వారు అధ్యాపకులుగా దొరికారు. వారి ప్రభావం వల్ల ప్రాచీన కవిత్వం అలంకారాలు వంటి విషయాలు కొంత అర్థమైనాయి. అలా కవిత్వం మీద అభిమానం పెరుగుతూ వచ్చింది. అయితే నేను జీవితంలో ఒక్కో దశలో ఒక్కో పని చేస్తూ వచ్చాను. అవసరమే నాతో అలా చేయించింది. అయితే లోలోపల కవితా దాహం మాత్రం అలాగే వుండిపోయింది. మామూలుగానే నాకు కుతూహలం ఎక్కువ. కిటికీల్లోంచి చూడటం అలవాటు. 'ఓల్గా సే గంగా' అసంఖ్యాకమైన కిటికీలు తెరిస్తే 'చంఘీజ్ ఖాన్' అంతులేని సాహస దృష్టినిచ్చింది. చదువుకునే రోజుల్లో నా సమయం ఎక్కువగా సినిమాలు నాటకాలకే సరిపోతుండేది. మార్కులు కూడా బాగానే వస్తుండేవి కనక టీచర్లు ఏమనే వారు కాదు. సినిమాలు ఎక్కువ సార్లు చూస్తుండేవాణ్ని కాని అప్పట్లోనే అనేక సందేహాలు

కలిగేవి. పాటలకు సంగీతం ఎక్కడి నుంచి వస్తుంది, వీళ్ళ మధ్యలో బట్టలెలా మార్చుకుంటున్నారు వంటి సందేహాలు వచ్చేవి. నిజానికి మెట్రిక్యులేషన్ నాటికే నాకు సినిమా గురించి ఒక అవగాహన వచ్చింది. సినిమాల శత దినోత్సవాలకు స్వంత ఖర్చుతో గోడలపై రాస్తుండేవాణ్ని.

గుంటూరులో ఆ రోజుల్లో సిపిఐ సిపిఎం వామపక్షాలుగా ప్రధానమైన ప్రభావం చూపిస్తుండేవి. నేను సహజంగానే ఆ ప్రభావంలో పడ్డాను. సుగమ్‌బాబు నన్ను బాగా ప్రభావితం చేశాడు. తను అప్పటికే పేరున్న కవి. దిగంబర కవిత్వం వచ్చినపుడు నాకు పెద్ద వ్యతిరేకత లేదు గాని ఆ శైలి నచ్చేది కాదు. అలాటి చాలా విషయాలు సుగమ్‌బాబు దగ్గరే తెలుసుకున్నాను. ఆయనే నాకు 'కమ్యూనిస్టు ప్రణాళిక' ఇచ్చాడు. దాన్ని చదివాకే నా అవగాహన సమూలంగా మారిపోయింది. చూపే మారిపోయింది. వర్గాలు, వర్గ పోరాటాలు, దోపిడీ, పీడన వంటి మాటలకు అర్థం తెలిసింది. సమాజ సారాంశం బోధపడింది. అదే నాకు దిక్సూచి అయ్యింది. అందులోని భావాలను చెప్పడానికి ఉపయోగించిన భాష కూడా నన్ను కట్టిపడేసింది. నాలో వామపక్ష భావాలవైపు మొగ్గు కొనసాగడానికి అదే కారణం. నిజానికి నేను సినారాయణరెడ్డి కవిత్వం చదివి కవితలు రాయడం మొదలు పెట్టాను తప్ప మొదట 'మహాప్రస్థానం' చదివి కాదు. సుగమ్‌బాబు ఆ రోజుల్లో సిపిఐకి దగ్గరగా వున్న సిపిఎంకు చెందిన స్థానిక యువకులు కూడా తన దగ్గరకు వస్తుండేవారు. డా॥పరుచూరి రాజారామ్ వంటి రచయితలు మేధావుల ప్రభావాలూ వుండేవి. రాజకీయంగానూ కార్మిక విద్యార్థి సంఘాలలోనూ కొంత ఘర్షణ వాతావరణం కూడా వుండేది. అప్పుడే గోర్కీ రచనలు, గంగినేని వెంకటేశ్వరరావు 'ఎర్రజండాలు', సోమసుందర్ 'వజ్రాయుధం', అనిసెట్టి 'అగ్నివీణ', దాశరథి 'కవితా పుష్పకం', శ్రీశ్రీ 'ఖడ్గసృష్టి' వంటి రచనలు చదివాను. రాజకీయ సాహిత్యపరమైన ఆలోచనలు ఒక రూపం తీసుకున్నాయి.

అలాంటి నేపథ్యంలోనే నేను, ఓల్గా, సుగమ్ బాబు కలసి వెలువరించిన సంకలనం 'పైగంబర కవుల సంపుటి' పేరుతో విడుదలైంది. ఆ నిర్ణయం సుగమ్ బాబే చేశాడు గాని దాని ఆవిష్కరణ విశాలాంధ్ర మేడపైన జరగడంతో మేము సిపిఐ అన్న భావన ప్రచారంలోకి వచ్చింది. అదేమి నిజం కాదు. విశాఖ విద్యార్థుల కరపత్రం వగైరాల తర్వాత విరసం ఆకర్షించింది. ఖమ్మంలో దాని మహాసభలకు వెళ్లాను. కాని అప్పటి నుంచే నాలో చాలా సందేహాలుండేవి. ఏం జరుగుతుందో తెలియకుండా ఎలా చేరడం అనిపించింది. రాజకీయాలే ప్రధానంగా అనిపించాయి. తెలియకుండానే ఆగిపోయాను. మేము ముగ్గురం ఖమ్మం వెళ్లినా ఓల్గా సుగమ్ బాబు విరసంలో చేరిపోయారు. నేను చేరకుండానే తిరిగివచ్చాను. సాధారణంగా కమ్యూనిస్టు భావాలపై వుండే ఆకర్షణ తప్ప అంత అవగాహన లేదు కూడా. అందుకే ఎప్పుడూ మరీ హడావుడి చేయకుండా కొంత సమయంనంతో వుండేవాణ్ని.

1972 తర్వాత పదేళ్ల అనిసెట్టి గారితో పాటు మద్రాసులో వున్నాను.ఆయన డబ్బింగ్ చిత్రాలకు రాయడంలో దిట్ట. సాహిత్యానికి సంబంధించిన చాలా విషయాలు తెలియడానికి ముఖ్యంగా ఆంగ్ల సాహిత్య పరిచయం కలగడానికి ఆయన దోహదం చేశారు. కొన్ని సినిమాల టైటిల్స్‌లో ఆయన పేరుతో పాటు నా పేరు కూడా వుండటం చూడొచ్చు.అయితే నేను1980ల తర్వాత అక్కడి నుంచి వచ్చేశాను.మరో విధంగా సినిమా రంగంలో పనిచేశాను. అంతకు ముందు యాభైలలో తెలంగాణా పోరాటంపై నిర్బంధం వల్ల ప్రగతిశీలులు చాలా మంది మద్రాసు వెళ్లి చిత్ర పరిశ్రమలో ఆశ్రయం పొందడంతో పాటు దాన్ని మంచి మలుపు తిప్పేందుకు దోహద పడ్డారు. కాని నేను వెళ్లిన నాటి పరిస్థితి వేరు. ఆ వాతావరణంలోనే ప్రత్యామ్నాయ చలనచిత్ర కళ గురించి అధ్యయనం చేసేందుకు ప్రయత్నించాను. తర్వాత కాలంలో మాభూమి వంటి చిత్రాలకు పనిచేసేందుకు ఆ అనుభవం పనికివచ్చింది. చాలా పత్రికలోనూ, అడ్వర్టయిజ్‌మెంట్ రంగంల్లోనూ కీలకమైన బాధ్యతలు నిర్వహించేప్పుడు సామాజిక చైతన్యం కాపాడుకోవడానికి, సౌందర్య దృష్టి నిలబెట్టుకోవడానికి 'కమ్యూనిస్టు ప్రణాళిక' ఇచ్చిన అవగాహన మూలాధారమై నిలిచింది.

సుందరయ్య గారు మరణించినపుడు 'ఉదయం'లో నా రన్నింగ్ కామెంట్రీ శీర్షికలో రాసిన చరణాలు ఎందరినో ఉత్తేజ పర్చాయి. వాటిని ఫ్రేము కట్టించి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి ఇచ్చాను. నేను 'ఆంధ్ర జ్యోతి' ఆదివారం అనుబంధం బాధ్యతలు చూస్తున్నప్పుడు స్త్రీవాదం, దళితవాదం వంటి వాటిపై చర్చ పెరగడానికి కొంత దోహదం చేశాను. సామాజిక ఆర్థిక మార్పుల వల్ల కొత్త తరగతుల్లో కానవస్తున్న తహతహకు వామపక్షాలు చొరవ తీసుకోవాలని నేను ఆశించాను. ఈ సామాజిక తరగతులు వామపక్షాలతో మమేకం కావాలంటే బాగా విజ్ఞానవంతం చేయాల్సి వుంటుందని అనుకుంటాను. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన పీడిత వర్గాలలో ప్రధానభాగమైన వారిని కలుపుకొని పోవడానికి వామపక్షాలు మరింత ప్రాధాన్యత నివ్వాలని అనుకుంటాను.

'కమ్యూనిస్టు ప్రణాళిక' ఇచ్చిన ఉత్తేజం, విశ్వాసం నాలో నిలిచి వుండబట్టే సోవియట్ యూనియన్‌లో గోర్బచెవ్ వినాశకర మార్పులు తీసుకొస్తున్నప్పుడు 'హిట్లర్ నవ్వు' పేరుతో ఒక కవిత రాశాను. అది 1990లోనే. అంటే ఇంకా పూర్తిగా విచ్ఛిన్నం కాకముందే. 'ఇది పావురాయి వేషం కట్టుకున్న డేగ/ ముక్కుకి కరుచుకున్న అరుణరత్నం/ ఎన్ని ఆకాశాలను జయించి వేసుకున్న పందిరి ఇది/ ఎన్ని మంచు మైదానాలను దాటి/ వెలిగించుకున్న తూర్పు ఇది/ అంటూ అలాంటి రష్యాను

'కమ్యూనిస్టు ప్రణాళిక' ఇచ్చిన ఉత్తేజం, విశ్వాసం నాలో నిలిచి వుండబట్టే సోవియట్ యూనియన్‌లో గోర్బచెవ్ వినాశకర మార్పులు తీసుకొస్తున్నప్పుడు 'హిట్లర్ నవ్వు' పేరుతో ఒక కవిత రాశాను. అది 1990లోనే. అంటే ఇంకా పూర్తిగా విచ్ఛిన్నం కాకముందే. 'ఇది పావురాయి వేషం కట్టుకున్న డేగ/ ముక్కుకి కరుచుకున్న అరుణరత్నం/ ఎన్ని ఆకాశాలను జయించి వేసుకున్న పందిరి ఇది/ ఎన్ని మంచు మైదానాలను దాటి/ వెలిగించుకున్న తూర్పు ఇది/ అంటూ అలాంటి రష్యాను భ్రష్టుపట్టిస్తున్నారన్న ఆవేదన వినిపించాను. వీటన్నిటినీ చూసి విప్లవ కారులు ఆవేదన చెందుతుంటే హిట్లర్ నవ్వు ప్రతిధ్వనిస్తుందంటూ ముగించాను.



భ్రష్టుపట్టిస్తున్నారన్న ఆవేదన వినిపించాను. వీటన్నిటినీ చూసి విప్లవ కారులు ఆవేదన చెందుతుంటే హిట్లర్ నవ్వు ప్రతిధ్వనిస్తుందంటూ ముగించాను. సోవియట్ విచ్ఛిన్నం జరిగినప్పటికీ సోషలిజంపై విశ్వాసం మాత్రం సన్నగిల్లలేదు. కాకపోతే ఈ పరిణామాలపై మా వంటి వారికి ఇప్పటికి పూర్తి స్పష్టత రాలేదు. ఏది ఎందుకు జరిగిందన్న దానిపై వామపక్షాలు మావంటి వారికి స్పష్టతనిచ్చి ఐక్యంగా తీసుకుపోవాలని భావిస్తుంటాను. ఇప్పుడున్న ప్రతికూల వాతావరణంలో ప్రగతిశీల లౌకిక వాద శక్తుల మధ్య విశాల అవగాహన అవసరమని కూడా నా అధ్యయనం అనుభవం చెబుతున్నాయి. ★

చెత్తకుండీ

మహానగరం బద్ధకంగా ఒళ్లు విరుచుకుని
ఆవులిస్తూ కళ్లు తెరిచింది
నగరంతో సహా నాకూ మెలకువ వచ్చింది
భుజాన పొడవాటి సంచిని తగిలించుకుని
కాళ్లీడ్చుకుంటూ, కళ్లు నులుపుకుంటూ రోడ్డున పడ్డాను
చెత్తకుండీ నాకు స్వాగతం పలికింది
చిత్తుకాగితాలు స్నేహకుశలాలు అడిగాయి
శునకరాజాలు శుభోదయం చెప్పాయి
దుర్గంధం సుమగంధమై నన్ను తాకింది
ఎంగిలాకులు ఆకలి బాధని తీర్చాయి
నాకున్న స్నేహబృందం, ప్రేమబంధం వీటితోనే
ఆత్మీయత, అనునయింపులు పంచేవి యివే
జానెడు పొట్ట చేతబట్టుకుని
ఈ మహానగరానికి వచ్చాను
ఏ దిక్కూ మొక్కూ లేని నాకు
ఈ చెత్తకుండీనే అమ్మలా ఆదరించింది
ఆత్మీయపు ఆశ్రయాన్ని యిచ్చింది
ప్రతిరోజూ ఏ ఫుట్‌పాత్ మీదో నా బతుకు తెల్లవారుతుంది
మనుషులెవరూ నన్ను ఆప్యాయంగా పలకరించరు
అసహ్యించుకుంటూ పక్కకి జరిగిపోతారు
ఎవరూ పంచని ఆప్యాయతని చెత్తకుండీనే ప్రసాదిస్తూ వుంది
అదే నాకు ఆకలి తీర్చే తల్లి అయ్యింది
అల్లుకుపోయే స్నేహలత అయ్యింది
ఆ చెత్తకుండీనే లేకపోతే
ఈ జనారణ్యంలో నేను ఏమైపోయే వాడినో?!
'చెత్త' మనుషులు తీసుకొచ్చి కుండీలో పడేసే వ్యర్థాలే అయినా
వాటికి మనుషులకి వున్నంత మలినం వుండదు
చెవిపెట్టి వింటే చెత్తకుండీనే
మనుషుల జుగుప్సాకరమైన జీవితాల గురించి
కథలు కథలుగా చెప్తుంది
వాడిపడేసిన కండోమ్‌లు
తాగిపడేసిన మద్యం సీసాలు
వావివరసలు, ఉచ్చనీచాలు మరచిన
ఉన్మాదుల పైశాచికత్వాన్ని తేటతెల్లం చేస్తుంది
అందుకే-
చెత్తకుండీని చిన్నచూపు చూడకు
ఎందరో అనాథల, అభాగ్యుల పాలిట
అది మాతృత్వపు మధురిమల గీతిక
శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీక

- సాహిత్య ప్రకాశ్

స్వప్నమూ సంఘర్షణా



ఇక్కడే
ఈవీధిలో
ఉదయ సూర్యునికోసం
వీధిని సిద్ధం చేస్తూ..
అలసట
అనిపించినప్పుడు
పంచన చేరి
వంచెన లెరుగని
గుల్‌మొహర్
కొమ్మల్లో దాచిన
నా కిన్నెరను
బయటికి తీస్తాను
కిన్నెరగానం కోసం
వీధీ
వీధిలో సంచారం కోసం
కిన్నెరా.
వీధీ, కిన్నెరా, నేనూ
వేర్వేరు కాదు
ఒక్కటే
స్వప్నమూ ఒక్కటే
సంఘర్షణా ఒక్కటే

-హిమజ్వాల

హైకూలు...

తాడితలపై
పున్నమి చంద్రుడు
చిరు నవ్వుతో...

తీగ క్రిందనే
వాన చినుకులు
బారులు తీరి...

జెండా ఎగిరింది
పూలు రాలాయి
పావురాలెక్కడ?

చెరువులో
నిండు చంద్రుడు
కొరకాలని కొంగ...

ముళ్ళ కంపపై
మల్లె తీగ పాకింది
ఏనాటి బంధమో!

- వసుధ గుడివాడ

కల్లోలం

దుర్మార్గాలతో, దురాకృతాలతో
భుగభుగ మండెను భూగోళం!
అందువల్లనే ప్రపంచమంతా
జనజీవన కల్లోలం!

కపటం, ద్రోహం, స్వార్థం, ద్వేషం
దోచెను మానవ శీలం!
అందువల్లనే జగమంతా ఈ
జనజీవన కల్లోలం!

ధనమే ప్రాణం! సిరియే దైవం!
విత్తే జీవనమూలం!
అందువల్లనే విశ్వమంతటా
జనజీవన కల్లోలం!

స్నేహం అన్నా, ప్రణయం అన్నా
విలువేలేని కాలం!
అందువల్లనే వీధివీధిలో
జనజీవన కల్లోలం!

ఉన్నవాడికే తొలి తాంబూలం!
లేనివాని నోటికి ఒక తాళం!
అందువల్లనే సమాజమంతా
జనజీవన కల్లోలం!

ఆ పక్క ఆనందంమేళం
ఈ పక్క అందదు ఒక కబళం
ఒకరికేమో పూల అందలం
ఒకరికేమో సర్వమంగళం!
అందువల్లనే అవని అంతటా
జనజీవన కల్లోలం !

ఆధునికత్వం అంతర్జాలం-
మనుషులనే విడదీసే జాలం!
బ్రతుకు బ్రతుకులో గందరగోళం!
కరుణ చూపని ఈ కలికాలం
చిరుచేపను కబళించే గాలం!
అందువల్లనే అడుగు అడుగునా
జనజీవన కల్లోలం!

కరుణ చూపదే శివుని త్రిశూలం?
అధర్మాన్ని చేయదె నిర్మూలం?
కాలం పాపులకే అనుకూలం
పాలు తాగి కాటేసే వ్యాళం!
అందువల్లనే ధరాతలంలో
జనజీవన కల్లోలం!
జనజీవన కల్లోలం

భవిష్యవాణి

మాయ ఓదార్పుల మత్తులో పడి
మాటిమాటికీ ఓట్లు రాల్చే ఓటు జీవులూ
ప్రలోభాల వలలకు చిక్కే పతితులూ-
నయవంచక నాయకులను నట్టేటముంచే-
నాణ్యమైన కాలం త్వరలోనే ఆసన్నమౌతుంది!
వేయి సంవత్సరాలు మనోవేదనలను భరించిన-
శుషుప్త జ్వాలాముఖి-
లక్ష శకలాలతో విస్ఫోటించే
లక్షణమైన రోజు రాక మానదు!
తూట్లుపడ్డ శరీరాలే తూణీరాలై
శరణు శరణు అన్న బాధిత హృదయాలే శరపరంపరలై
అణగారిన వారందరూ అస్త్రధారులై పోరే కాలం
సమీప భవిష్యత్తులో సంభవించక మానదు!
నిర్దాక్షిణ్యంగా నిర్మూలించబడ్డ పచ్చనిచెట్లు
ప్రాకృతిక అల్లకల్లోలాలకు ప్రాతిపదికలైనట్లు,
పాలితుల పదఘట్టనలో చెల్లాచెదురైన జీవితాలన్నీ
మానవ అరాచకాలననచే అంగారాలైపోతాయి!
న్యాయబద్ధ పోరాటానికి అంగాంగాలైపోతాయి!
పీడిత అంతరంగాలను ఇంకా పిండేస్తూ
ముప్పు కల్గించే వారిపై ముప్పేటలా దాడి చేసే
ముహూర్తం త్వరలోనే ముంచుకురానున్నది!
సహనం సముద్రము కన్నా గొప్పదైనా
సమాజం -హద్దుమీరేలా సతాయిస్తే
ప్రళయమే దాని ఫలితమౌతుంది!
ఓర్పు నశించిన పాదాక్రాంతులందరూ
విప్లవతరంగమై విజృంభిస్తే
ప్రపంచమే పాదాక్రాంతమైపోతుంది.

- ఎరుకలపూడి గోపీనాథరావు



సినీ పరిశ్రమలో కాంబినేషన్లకి చాలా పెద్ద క్రేజ్ వుంటుంది. కాంబినేషన్లు రిపీట్ కావడం వలన వరుస సక్సెస్‌లు వస్తాయని గాఢంగా నమ్ముతారు. వరసగా వచ్చే ఆ చిత్రాలు వరుస పరాజయాన్ని చవిచూస్తే ఇక ఆ కాంబినేషన్. అక్కడితో ఆగిపోతుంది. సాధారణంగా భారీ విజయాలు వచ్చినపుడు కాంబినేషన్‌లు సాగిపోతాయి. అయితే ఈ కాంబినేషన్ల వలన చిత్ర నిర్మాణంలోనేకాదు ప్రేక్షకుల్లో కూడా ఒక రకమైన ఆసక్తి నెలకొంటుంది. తమ అభిమాన నటుల కాంబినేషన్ చిత్రాలు వస్తున్నాయంటే తప్పనిసరిగా సక్సెస్ అవుతాయని ఓ అంచనాతో వుంటారు. అలాంటి చిత్రం పల్టీకొడితే మళ్ళీ వారి కాంబినేషన్‌లో చిత్రం రాదేమోనని నిరాశపడతారు. కాంబినేషన్లు కొనసాగాలంటే ముందుగా నిర్మాతలకు ఆసక్తి వుండాలి. ఒక నిర్మాత ఒకే కాంబినేషన్‌లో చిత్రాలు తీయడం వేరు. అనేకమంది నిర్మాతలు అలాంటి కాంబినేషన్‌ని కోరుకోవడం వేరు. చిత్ర పరిశ్రమ ఏ భాషదైనప్పటికీ కాంబినేషన్లు నడుస్తూనే వుంటాయి. వాటిలో ఎక్కువ శాతం భారీ విజయాలే వుంటాయి.

అదిరేటి కాంబినేషన్లు...

- బాసు

కాంబినేషన్లలో దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులు ఎక్కువగా కలసి పనిచేయడం వల్ల వారి మధ్య పోటీతత్వం పెరిగి ఇంకా మంచి విజయం సాధించాలనే తపన కనిపిస్తుంది. ఈ విధానంలో నిర్మాత కూడా ఎంతైనా ఖర్చు పెట్టడానికి వెనుకాడడు. ఎందుకంటే కాంబినేషన్ల పట్ల ప్రేక్షకులు కూడా విపరీతమైన మోజును పెంచుకోవడమేకాదు భారీ ఓపినింగ్స్‌ని కూడా అందిస్తారు. పరిశ్రమలో కాంబినేషన్లు కొనసాగితే ఒక సినిమాకు పనిచేసిన వారికి పదేపదే అవకాశాలు వస్తాయి. దీనివల్ల మిగతా వారికి తగిన అవకాశాలు రాకపోవచ్చు. ఒక్కోసారి కాంబినేషన్లలో ఏదో విభాగంలో మార్పులు జరిగి కొత్తవారు కూడా చేరవచ్చు. అలాంటప్పుడు సక్సెస్ వస్తేనే వారికి మళ్ళీ అవకాశం లభిస్తుంది. లేకపోతే పక్కకువెళ్ళిన పాతవారినే తిరిగి తీసుకోవడం జరుగుతుంది.

తొలితరం నుండి మొన్న మొన్నటితరం వరకు కాంబినేషన్లు విరివిగా కనిపించినా ప్రస్తుతం సృజనాత్మకత పేరుతో కాంబినేషన్ల ప్రాధాన్యత తగ్గింది. ఏదో అడపాదడపా తారలు, దర్శకుల, దర్శకుల-సాంకేతిక నిపుణుల కాంబినేషన్లు కనిపిస్తున్నాయి. సినిమా మొత్తంలో ఏ యిద్దరు కొన్ని చిత్రాలకు కలిసి పనిచేసినా ప్రేక్షకులు దాన్ని కూడా కాంబినేషన్‌గానే భావిస్తారు. అలాగే వారినుంచి చక్కటి సినిమాని ఆశిస్తారు. ఒకే సంగీత దర్శకునితో ఓ దర్శకుడు పదే పదే కలిసి పనిచేస్తే సంగీతం బావుంటుందని దానివలన సినిమా మ్యూజికల్‌గా సక్సెస్ అయినట్టేనని ప్రేక్షకులు సినిమా ముహూర్తం నాడే ఓ అంచనాకు వచ్చేస్తారు. ఇలా కాంబినేషన్లు సినిమాకు ప్లస్ అవుతాయి.

ఎన్టీఆర్... సావిత్రి, జమున, అంజలీదేవి, బి.సరోజాదేవి వంటి వారితో జతకట్టినా ఎన్టీఆర్-కృష్ణకుమారి కాంబినేషన్ ప్రేక్షకులకు బాగా నచ్చింది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'బందిపోటు, లక్షాధికారి' వంటి చిత్రాలు బాగా అలరించాయి. ఎన్టీఆర్‌తో ఎంతోమంది దర్శకులు పనిచేసి మెప్పించినా ఆయనతో కె.వి.రెడ్డి కాంబినేషన్ చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. నిర్మాతల కాంబినేషన్‌లో ఎన్టీఆర్-చక్రపాణి-నాగిరెడ్డిల విజయా ప్రొడక్షన్స్, ఎన్టీఆర్‌కి మాతృసంస్థగా నిలిచింది. ఎన్నో విజయాలను అందించింది.

అక్కినేని విషయానికొస్తే యిప్పటివరకు ఆయన సరసన 80 మంది పైగా హీరోయిన్లు

నటిస్తే వాణిశ్రీ కాంబినేషన్ పెద్ద పేరును తెచ్చింది. పాతతరంలో సావిత్రి, జమునలు అక్కినేనికి సిసలైన జోడీలు అనిపించుకుని సాంఘిక చిత్రాల్లో భారీ విజయాలను అందించాయి. ఎంతో మంది దర్శకులు పనిచేసినా అక్కినేని-ఆదుర్తి సుబ్బారావు, అక్కినేని-మధుసూధనరావు కాంబినేషన్ అంటే ప్రేక్షకులు బాగా యిష్టపడేవారు.

కృష్ణ సంవత్సరానికి 18 చిత్రాలు చేసి రికార్డు సాధించడమే కాకుండా యిప్పటికి 300 పై చిలుకు చిత్రాల్లో హీరోగా నిలబడ్డారు. ఈయన సరసన జయప్రద, శ్రీదేవి కాంబినేషన్ చిత్రాలు పెద్ద విజయాలను నమోదు చేసుకున్నా కృష్ణ-జయసుధ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలే ఎక్కువగా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాయి. జయసుధ కృష్ణ ద్వారానే ఇండస్ట్రీకి పరిచయమైనా ఆయన సరసన అగ్రతారస్థాయికి చేరుకోగలిగింది. కృష్ణను డైరెక్ట్ చేసిన మహిళా దర్శకురాలిగా విజయనిర్మలదే రికార్డు. దానికి కూడా కృష్ణ చేయూతే కారణం. వీరి కాంబినేషన్‌లో విజయనిర్మల నటిగా, దర్శకురాలిగా కూడా మంచి విజయాలే వచ్చాయి.

శోభన్‌బాబు చిత్రాలు ఫ్యామిలీ, రొమాంటిక్‌వి కావడం వలన ఇద్దరు హీరోయిన్లు కంపల్సరీగా వుండేవారు. ఈయనతో రాధిక, జయప్రద, శ్రీదేవి, జయసుధ వంటి ఎంతోమంది హీరోయిన్లు నటించినా శోభన్‌బాబు-శారద కాంబినేషన్‌కే ప్రేక్షకులు ఎక్కువ అభిమానం చూపారు. జయసుధ అత్యధికంగా హీరోయిన్‌గా నటించినా గ్లామర్ పాత్రలు ఎక్కువ కావడం వలన శారద-శోభన్‌బాబు కాంబినేషన్ ప్రేక్షకులకు బాగా చేరువయ్యింది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'శారద, బలిపీఠం, మనుషులు మారాలి, రాధమ్మ పెళ్ళి' భారీ విజయాలను చేజిక్కించుకున్నాయి. శోభన్‌బాబుకి అందరు దర్శకులు మంచి విజయాలను అందించిన వారే.

కృష్ణంరాజు సరసన వాణిశ్రీ, శారద, జయప్రద, శ్రీదేవి, రాధిక వంటి హీరోయిన్లు ఎందరు నటించినా కృష్ణంరాజు-జయసుధ కాంబినేషన్‌కే ఎక్కువ మార్కులు పడ్డాయి. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'బొబ్బిలి బ్రహ్మన్న, ధర్మాత్ముడు, భారతంలో శంఖారావం, అమరదీపం' వంటి ఎన్నో సినిమాలు భారీ విజయాలను మూటకట్టుకున్నాయి. కృష్ణంరాజుకి మంచి విజయాలు అందించిన దర్శకుల్లో బాపు, రాఘవేంద్రరావు, బి.భాస్కరరావు ముందుంటారు.

చిరంజీవిని డైరెక్ట్ చేయడంలో ఎ.కోదండరామిరెడ్డి 26 సినిమాలతో ముందుంటే గ్లామర్ విజయాలను అందించడంలో రాఘవేంద్రరావు వున్నారు. అత్యధికంగా రాధిక హీరోయిన్‌గా నటిస్తే విజయశాంతి, రాధలు చిరంజీవితో డాన్స్‌లో బాగా పోటీపడిన వారిగా గుర్తింపు పొందారు.
'కోదండరామిరెడ్డి-రాధ-చిరంజీవి' కాంబినేషనంటే అది హిట్టే అని ప్రేక్షకులు భావించే స్థాయిలో వుండేది.

బాలకృష్ణకు కాంబినేషన్ విజయాలను అందించడంలో భార్గవ్ ఆర్ట్స్ ముందుంది. 'భార్గవ్ ఆర్ట్-కోడిరామకృష్ణ-బాలకృష్ణ' కాంబినేషన్ అంటే అప్పట్లో అదో సంచలనంగా వుండేది. తరువాత బాలకృష్ణను దర్శకత్వం చేయడంలో బి.గోపాల్ మంచి పేరు సంపాదించుకున్నారు. బాలకృష్ణ సరసన ఎంతమంది హీరోయిన్లు నటించినా బాలకృష్ణ-విజయశాంతి జంట అప్పట్లో జనానికి బాగా నచ్చేది.

నాగార్జున సరసన ఎంతమంది నటించినా నాగార్జున-అమల కాంబినేషన్ అటు నాగార్జునకు యిటు ప్రేక్షకులకు బాగా నచ్చింది. నాగార్జునను భక్తి కోణంలో చూపించి చిరస్థాయి నటుడ్ని చేయడంలో రాఘవేంద్రరావు బెస్ట్ దర్శకుడిగా పేరుపొందారు. నాగార్జున కెరీర్‌లో 'గీతాంజలి, శివ, అన్నమయ్య' మరువలేని హిట్స్‌గా వున్నాయి.

వెంకటేష్-సౌందర్య కాంబినేషన్ చిత్రాలు ప్రేక్షకులకు వారిని మరింత దగ్గర చేసాయి. సూపర్‌గుడ్ ఫిలింస్-వెంకటేష్ కాంబినేషన్ అంటే చాలావరకు పెద్ద విజయాలే దక్కించుకున్నాయి. 'సూర్యవంశం, సంక్రాంతి, రాజా' వంటి విజయాలు వెంకటేష్ కెరీర్‌లో మైలురాళ్ళుగా నిలిచాయి. ప్రస్తుతం వున్న హీరోల్లో వెంకటేష్‌తో ఎక్కువగా హీరోయిన్ల కాంబినేషన్ రిపీట్ కావడం కనిపిస్తుంది.

రిపీట్ దర్శకుల కాంబినేషన్‌లో జూ.ఎన్టీఆర్‌తో వినాయక్, రాజమౌళిలు మూడేసి చిత్రాలు, భీమినేని శ్రీనివాసరావు, పవన్‌తో కరుణాకరన్, త్రివిక్రమ్ శ్రీనివాస్, గుణశేఖర్-మహేష్‌బాబుతో రెండు చిత్రాలు, పూరీజగన్నాథ్-రవితేజతో ఎక్కువ చిత్రాలు, అల్లుఅర్జున్‌తో వినాయక్ రెండు చిత్రాలు (ప్రస్తుతం బద్రీనాథ్ రూపొందుతోంది) తీసినవారుగా వున్నారు.

సాంకేతిక నిపుణుల విషయానికొస్తే రాజమౌళి-కీరవాణి, ఎ.ఆర్.రెహమాన్-శంకర్, తేజ-ఆర్‌పి, గుణశేఖర్-మణిశర్మ, పూరీ-చక్రి, పవన్-రమణగోగుల మొదలగువారు పనిచేసి సక్సెస్‌లు వరుసగా సాధించారు. సినీ పరిశ్రమలో భారీ సక్సెస్‌లు వున్నంతసేపూ ఎవరితోనైనా రిపీట్ కాంబినేషన్‌లు రావడం విశేషం. ఒక్కసారి కాంబినేషన్‌లో మార్పులు వస్తే ఎవరి దారి వారిదేనన్నది కూడా చాలా కాంబినేషన్లతో రుజువైంది. కాంబినేషన్లు చక్కగా కొనసాగితే మంచి విజయాలు సాధించవచ్చునన్న సత్యాన్ని ప్రేక్షకులు ఎప్పుడూ చూస్తూనే వున్నారు.

★



క్రైమ్ కథ

బోణీ

రోడ్డుపక్క దాబా వెనుక పొదల్లో ఒక శవాన్ని ప్యాక్ చేశాడు.

శవాన్ని నాలుగు ముద్దుకర్రలు వేసి కట్టేశాడు. ఆపైన ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్‌చేశాడు. శవం ఏదో వస్తువు ప్యాక్‌లా ఉందనిపిస్తుంది. పొదల్లోకి ప్యాక్ ఈడ్చేసి వెనక్కివచ్చి రెండు కుర్చీలు వాటి మధ్య టేబిల్‌మీద రెండుగ్లాసులు చూస్తూ కూర్చున్నాడు. తన గ్లాసు ఎత్తి పోసుకుని మరో గ్లాసును చూసి పేలవంగా నవ్వాడు మాధవ్.

మద్యం వ్యాపారం చేసే మాధవ్‌తో చేతులు కలిపి వడ్డీ వ్యాపారం చేయాలని కలలు కన్నాడు రంజిత్. అంతగా నమ్మించాడు మాధవ్. ఇద్దరూ కలిసి వ్యాపారానికి చెరో 20 లక్షలు పెట్టుబడి పెడదాం అనుకున్నారు. ఇల్లు అమ్మి డబ్బు తెచ్చిచ్చాడు. ఇక వీడు భూమిమీద ఉండరాదనుకుని రంజిత్‌ను మాధవ్ ఖతమ్ చేశాడు. దీనికి డాబాలో దంపతులు సహకరించారు. ఆరోజు డాబా వ్యాపారం బంద్ చేసేసి ఈహత్యలో ఉన్నారు.

చీకటి పడుతుండగా రంజిత్, మాధవ్ కారు దిగారు. ఇద్దరు మద్యం మోతాదుకు మించి తాగేశారు. సుష్టుగా తిన్నారు. మాధవ్ తాగినట్టు నటించాడు. "రంజిత్ ఐదేళ్లలో మనం పెట్టే పెట్టుబడి కోట్లలోకి పోవాలి..." అని గొణుగుతుంటే "నువ్వు యమపురి నుంచి అవన్నీ తీరిగ్గా చూడవచ్చు" అని మాధవ్ రంజిత్ మెడవంచి గొంతు కోశాడు. కుర్చీతోసహా మట్టినేల మీద పడిపోయి క్షణాల్లో ప్రాణాలు వదిలాడు.

ఆ వెంటనే దాబా దంపతులు మాధవ్ కలిసి శవాన్ని పొదల్లోకి ఈడ్చేశారు. కుర్చీపై రక్తం కడిగేశారు. మట్టి నేలమీద రక్తం పడినందుకు నీళ్లతో తడిపేశారు. తర్వాత శవాన్ని ప్యాక్ చేశారు.మూడొంతులు పనయిపోయింది. ముగ్గురు కలిసి గంటసేపట్లో ఆపని పూర్తిచేశారు.

దాబా దంపతులు ఆపని చేయడానికి నలభైవేలకు ఒప్పుకున్నారు. అలాగే ఘాట్‌రోడ్డులోకి వెళ్లే లారీ డ్రయివర్‌ను కుదిర్చింది వాళ్లే. వారు చేయంది హత్య మాత్రమే. చంపలేమన్నారు. చంపాక శవాన్ని పక్కలో వేసుకుని నిద్రపొమ్మన్నా పోగలం కానీ, చంపలేమని ముందే చెప్పారు. హత్య చేస్తే రంజిత్ వారికి లక్ష రూపాయలు ఇస్తామన్నాడు. లారీడ్రయివర్ వచ్చాడు.

అతడి పేరు సయ్యద్. ఇలాంటి నేరాల్లో సాయం చేస్తే దండిగా డబ్బు వస్తుందనే ఆశమీద ఒప్పుకున్నాడు. సరిగ్గా రాత్రి 9నుంచి 11వరకు కరెంటుకోత ఉంటుంది. ఆటైమ్‌లో శవంప్యాక్‌ను లారీలోకి చేర్చాలనుకున్నారు. అనుకున్నట్టే లారీలోకి చేర్చారు. ధాన్యం పొట్టు బస్తాలు మధ్య పడేసారు.

సయ్యద్‌కూడా చెమటలు పోశాయి. అతడికి కొద్దిగా పని ఎక్కువే. ఘాట్‌లో లారీ నాలుగుగంటలపాటు వెడుతుంది. అదీ తెల్లవారుజాము మూడింటికి చీకట్లు పలుచనవుతాయి. లోయ ల్లోకి ప్యాక్ జారవిడవడమే. అందుకు ఒక లక్షకు ఒప్పందం.నోట్లకట్ట అందించాడు మాధవ్.

"సాబ్ మీరు చెప్పినట్టే చేస్తాను.బుట్టిగూడ ప్రాంతంలో దట్టమైన అడవి. అక్కడ చిరుతలు, ఎలుగులు బాగా తిరుగాడు తాయి. లోయలో పడేస్తే అటవీశాఖవాళ్లే వెళ్లరు. ప్యాక్‌ను నేను కత్తితో కోసి జార్చేస్తాను. జంతువులు తినేస్తాయి. కానీ భయంగా ఉంది. అన్నట్టు ఆశవంగాడు మీకు శత్రువా?"

'కాదు నాతో 20లక్షల వ్యాపారం చేయాలని చేతిలో డబ్బు పెట్టాడు. అందుకే ఖతమ్ చేశాను. ఈచిన్నపనికే లక్ష ఇస్తున్నాను"

"సాబ్ మీతో వ్యాపారం చేద్దామనుకున్నోడిని, బోణీయే హత్య చేశావంటే నీవు చాలా పెద్ద క్రిమినల్‌వే" అని సయ్యద్ పెద్ద కళ్లుచేసి తీక్షణంగా చూశాడు.

"జాగ్రత్తగా శవాన్ని లోయలో పడేసేయ్. తేడా వస్తే బావుండదు. ఇక బయల్దేరు" అని చెప్పి లారీ ఎక్కించేశాడు.

తెల్లవారుజామున మాధవ్‌కు సెల్‌లో సయ్యద్ చెప్పేశాడు. "సాబ్ పని అనుకున్నట్టే అయిపోయింది గుడ్‌న్యూస్ ఏమిటంటే ప్యాక్‌ను కత్తితో కొసేసి శవాన్ని జార్చాను. ఒకపులి నోట కరుచుకుని తీసుకుపోయింది"

అక్కడకి వారంరోజుల తర్వాత పోలీసులు వచ్చి మాధవ్‌ను ప్రశ్నించారు. రంజిత్ శవం ఘాట్‌రోడ్డులో ఒకచెట్టుమీద దొరికింది. శవం పోల్చుకోలేనిదిగా ఉంది. చినిగిన దుస్తుల్లో సిమ్ ఒకటి లభించడంతో దానిలో కొన్ని నంబర్లున్నాయి. వాటి ఆధారంగా రంజిత్ అని తెలిసింది.అతడు మిస్సయినట్టు భార్య కూడా చెప్పింది. శవం ఆనవాళ్లబట్టి రంజిత్ అని నిర్ధారణ అయ్యింది. మీఇద్దరు దాబాకు వచ్చారని తెలిసింది. ఆరా తీసేందుకు దాబా దంపతులను ప్రశ్నిస్తున్నాం అని చెప్పారు.

మాధవ్ సన్నగా వణికాడు. "నన్ను కాని ఆ దాబావారిని గాని అడగవద్దు. రంజిత్ నాతో కలసి వ్యాపారం అన్నాడేగాని మొదలు పెట్టలేదు. దీనివలన నా ఇమేజ్ డామేజ్ అవుతుంది" పెద్ద మొత్తం ఇవ్వచూపాడు. పోలీస్ అధికారి మొత్తం తీసుకుని సరే నిశ్చింతగా ఉండండని వెళ్లిపోయాడు. మాధవ్ హమ్మయ్య అనుకున్నాడు.

అక్కడికి మూడురోజుల్లో మస్తాన్‌ను పోలీసులు అరెస్టు చేసి తీసుకుని రాణాకు వెళ్లారు.అక్కడ దాబా దంపతులు, లారీ డ్రయివర్ సయ్యద్ ఉన్నారు. మాధవ్ రారెత్తిపోయాడు.

"మాధవ్ డబ్బుతో నావంటివారిని కొనలేవు. చేసిన నేరాన్ని వదిలించుకోలేవు" చెప్పి సెల్‌లోకి నెట్టాడు ఇన్‌స్పెక్టర్.

-యర్నాగుల సుధాకరరావు

మాధవ్ సన్నగా వణికాడు. "నన్ను కాని ఆ దాబావారిని గాని అడగవద్దు. రంజిత్‌నాతో కలసి వ్యాపారం అన్నాడేగాని మొదలు పెట్టలేదు. దీనివలన నా ఇమేజ్ డామేజ్ అవుతుంది" పెద్ద మొత్తం ఇవ్వచూపాడు. పోలీస్ అధికారి మొత్తం తీసుకుని సరే నిశ్చింతగా ఉండండని వెళ్లిపోయాడు. మాధవ్ హమ్మయ్య అనుకున్నాడు. అక్కడికి మూడురోజుల్లో మస్తాన్‌ను పోలీసులు అరెస్టు చేసి తీసుకుని రాణాకు వెళ్లారు.అక్కడ దాబా దంపతులు. లారీ డ్రయివర్ సయ్యద్ ఉన్నారు. మాధవ్ రారెత్తిపోయాడు.

ముల్లంగి పరోటా

కావాల్సిన వస్తువులు

ముల్లంగి దుంపలు- 4, గోధుమపిండి- అరకిలో నెయ్యి- 1 కప్పు, ఉప్పు- కొంచెం, కారం-1 స్పూన్.

తయారు చేసే పద్ధతి

గోధుమపిండిలో ఉప్పు కలిపి నీళ్ళతో ముద్దగా తయారు చెయ్యాలి. యెంత గట్టిగా పిసికితే పరోటాలు అంత బాగా వస్తాయి. ముల్లంగిదుంపలు పొట్టు తీసి శుభ్రంగా కడిగి కొబ్బరికోరుతో కోరుకోవాలి. ఈ కోరుకు ఉప్పు, కారం చేర్చాలి. గోధుమపిండితో పూరీలులాగా చేసి పూరీమీద ముల్లంగి కోరును పరచాలి. పూరీమీద పూరి పెట్టి వత్తాలి. అంచులు నొక్కితే ఒకదానికొకటి అంటుకుపోతుంది. దానిమీద అప్పడాల కర్రతో గట్టిగా వొత్తవచ్చు. పెనం మీద నెయ్యి రాసి పరోటా రెండువైపులా బాగా వేయించాలి.



ఆవళ్ పాయసం



కావాల్సిన వస్తువులు

అటుకులు- అరకప్పు
పాలు- 1 కప్పు
పంచదార- 25 గ్రాములు, నీళ్ళు- 1 కప్పు, జీడిపప్పులు- 5, యాలకులు- 3 మిరియాలు- కొంచెం, నెయ్యి- 1 స్పూన్, మిఠాయిరంగు- చిటికెడు, కిస్‌మిస్- కొంచెం

తయారు చేసే విధానం

అటుకులు నేతిలో గోధుమరంగు వచ్చేదాకా వేయించాలి. ఒక పాత్రలో నీళ్ళు పోసి బాగా మరగబెట్టాలి. మరుగుతున్న నీళ్ళలో అటుకులు వేసి మెత్తగా వుడకనివ్వాలి. ఇప్పుడు పంచదార చేర్చి కరగనివ్వాలి. పంచదార కరిగిపోయిన తర్వాత పాలు పోసి బాగా మరగనివ్వాలి. ఇందులో పాలలో రంగరించిన మిఠాయిరంగు వెయ్యాలి.

వేయించిన జీడిపప్పు, కిస్మిస్, పొడికొట్టిన యాలకులు, మిరియాలు కలిపి పొయ్యిమీద నుంచి దించెయ్యాలి. వేడిగా తాగితే బాగుండే పాయసాల్లో ఇదొకటి.



వరిపిండి అప్పడాలు

కావాల్సిన వస్తువులు

బియ్యం- అరకిలో, నిమ్మకాయలు- 2
ఉప్పు- చాలినంత, పచ్చిమిర్చి-100 గ్రాములు, ఇంగువ- చిటికెడు, జీలకర్ర- 1 స్పూన్
బియ్యప్పిండి-3 కప్పులు.

తయారు చేసే పద్ధతి

ఒక పాత్రలో నీళ్ళు పోసి బాగా మరగనివ్వాలి. సలసల కాగుతున్న నీళ్ళలో బియ్యం కడిగి పొయ్యాలి. నీళ్ళలో బియ్యం అయిదు నిమిషాలపాటు వుడికాక దించెయ్యాలి. తర్వాత నీళ్ళు వడగట్టి తడారబెట్టాలి. బూరెలమూకుడు వట్టిదే పొయ్యిమీదపెట్టి కాల్చాలి. బియ్యం కొద్దికొద్దిగా (ఒక చారెడు చొప్పున) వేసి వేయిస్తూ వుండాలి. వేయిస్తే బియ్యం గుల్లవిచ్చుతాయి. రెట్టింపు ప్రమాణంలో వుబ్బుతాయి. మరమరాలలాగా తయారవుతాయి. వీటిని తిరగలివేసి విసరాలి. మెత్తనిపిండిగా జల్లించాలి. సన్నవి జల్లెడతో జల్లించితే మెత్తని పిండి వస్తుంది. పచ్చిమిరపకాయలు, జీలకర్ర, పప్పు మెత్తగా రుబ్బాలి. రుబ్బినదాన్ని పలచని గుడ్డతో వడగట్టి రసం తియ్యాలి. నిమ్మకాయలు కూడ రసం తీసికొని వుంచాలి.

ఇంగువలో నీళ్ళు కలిపి పాలు తియ్యాలి. మొత్తమన్నీ కలిపి ముద్దగా చెయ్యాలి. ముద్దగా చేసిన దానిని రెండు మూడు గంటలు నాననివ్వాలి. బాగా మగ్గిన తర్వాత రోటిలోవేసిగాని చేతితోగాని మెత్తగా కుమ్మాలి. ఇలా జిగురువచ్చే వరకూ పిసకాలి. జిగురు రాకపోతే ఒక బెండకాయ తీసుకుని పచ్చిమిరపకాయలతో కలిపి రుబ్బి ఆ రసం పొయ్యవచ్చు.



ఈ పిండిని వుసిరికాయలంత వుండలు చేసుకొని ఆరిపోకుండా పైన తడిగుడ్డ కప్పాలి. అప్పడాల పీటమీద బియ్యపుపిండి (పొడిది) చల్లి దానిమీద ఈ పిండివుండలు వేసి అప్పడాలు వత్తాలి. ఎంత సన్నగవుంటే అంత మేలురకం అప్పడాలు అవుతాయి. తర్వాత ఎండలో ఎండబెట్టి డబ్బాలో భద్రపరచుకోవాలి.

పెసర సుండల్

కావాల్సిన వస్తువులు

పెసలు- అరకప్పు,
ఆవాలు- అర చెంచా
ఎండుమిర్చి- రెండు,
మినపప్పు- ఒక చెంచా
కొబ్బరి- చిన్నముక్క,
ఉప్పు-చాలినంత
కరివేపాకు- 2 రెబ్బలు, పసుపు- చిటికెడు, నూనె- 2 చెంచాలు, జీలకర్ర -కొంచెం, లవంగాలు- 5, పచ్చిమిర్చి- 2
నిమ్మకాయ- సగం చెక్క.

చేసే పద్ధతి

పెసలు శుభ్రంచేసి నీళ్ళలో కలిపి వుడకబెట్టాలి. మరీ మెత్తగా కాకుండా వేళ్ళతో వొత్తితే చితికిపోయేంత మెత్తగా వుడకబెట్టాలి. వుడుకుతున్నప్పుడే ఉప్పు, పసుపు, పచ్చిమిరపకాయలు, కొబ్బరికోరు, చితక్కొట్టిన లవంగాలు వెయ్యాలి. బాగా వుడికిన తర్వాత దించి ఆ పాత్రని వేరే వుంచుకోవాలి.

మూకుడు పొయ్యి మీద వుంచి నూనె వెయ్యాలి. అందులో ఎండు మిరపకాయలు, ఆవాలు మినపప్పు, జీలకర్ర, కరివేపాకువేసి తాలింపు పెట్టాలి. ఈ తాలింపులో వుడికిన పెసలు వెయ్యాలి.

వెంటనే మూత పెట్టేస్తే వాసన పోదు. తినేటప్పుడు నిమ్మకాయరసం పిండుకుంటే చాలా రుచిగా వుంటుంది. ఈ సుండల్‌కి పెసరపప్పు కంటే పెసలు వుపయోగిస్తేనే మంచిది.



శ్రీశైలక్షేత్ర పరిధిలో ఎటుచూసినా సహజ జలధారలు, జలపాతాలు దర్శనమిస్తుంటాయి. దట్టమైన అడవిలో, పచ్చని చెట్ల నడుమ ఎత్తైన కొండల నుండి కిందికి దూకే ఈ జలపాతాలు పర్యాటకులను ఊహకందని పారవశ్యానికి గురిచేస్తుంటాయి. ఈ సెలయేళ్ళ నీళ్ళ జలజలారావాలకు, పక్షుల కిలకిలారావాలు తోడై సందర్శకులను మైమరిపింపజేసి మరో తీయని లోకాలకు తీసుకుపోతాయి. శ్రీశైలంలోని ఇలాంటి జలపాతాలలో సర్వేశ్వరం, భైరవసెల, మల్లికాతీర్థం, గుప్తమల్లికార్జునం, భీమునికొలను ముఖ్యంగా చూడదగినవి.

పరవశింపచేసే శ్రీశైల జలపాతాలు

స్థానికంగా శైలేశ్వరంగానూ, సేలేశ్వరంగానూ పిల్చుకొనే సర్వేశ్వరం ప్రకృతి అందాలకు ఆటపట్టు. అటవీ మార్గంలో సాగే ఈ సర్వేశ్వర ప్రయాణంలో కనిపించే నెమళ్ళ నాట్యాలు, కుందేళ్ళ గెంతులు, జింకల పరుగులు ఈ ప్రాంతాన్నంతా ప్రకృతి అందాలకు కాణాచిగా చేశాయి. ఈ అటవీమార్గం రకరకాల చెట్లతో, రంగురంగుల అడవి పూలతో పోనుపోను చిక్కనై చక్కని అందాలతో సందర్శకుల మనస్సులను దోచుకుంటుంది.

సర్వేశ్వరంలో సర్వేశ్వర, పుష్కర తీర్థాలుగా పిలువబడే రెండు పుణ్యతీర్థాలున్నాయి. శ్రీపర్వత పురాణం ఈ తీర్థాలను ఎంతగానో కొనియాడింది. ఇక్కడి సర్వేశ్వరతీర్థానికి పడమటివైపు సుమారు 10 అడుగుల ఎత్తులో వుండే గుహాలయం శనీశ్వరాలయంగా పిలవబడుతోంది. ఇక్కడి సర్వేశ్వర జలపాతం నింగి నుండి నేలకు దిగిన ఆకాశగంగను తలపిస్తుంది. సుమారు 150 అడుగుల ఎత్తు నుండి నిరంతరం జాలువారే ఈ జలపాతం చూపరులకు వింత అనుభూతినిస్తుంది. శ్రీశైల పరిధిలోని జలపాతాలన్నింటిలోనూ సర్వేశ్వర జలపాతమే ఎత్తైనది. ఈ జలపాతం ముందుకు ప్రవహించి ఒక కుండాన్ని ఏర్పరచింది. దీన్నే పుష్కర తీర్థమని పిలుస్తారు. ఇందులోని నీరు కొంతదూరం పయనించి, సుమారు 900 అడుగుల విస్తీర్ణంలో సర్వేశ్వర తీర్థాన్ని ఏర్పరచింది. అందమైన ప్రకృతి నడుమగల సర్వేశ్వర సందర్శనం అనంతమైన ఆనందాన్నిస్తుంది.

భైరవసెల

ఒక వంక ఎత్తైన కొండలు, మరోపక్క లోతైన లోయలు, చుట్టూ దట్టంగా వ్యాపించిన అడవి, గుబురైన పొదలు, ఎగిసిపడే జలపాతాలు, వాటి ప్రవాహాల హోరు తప్ప మరే శబ్దమూ వినపడని ప్రశాంత వాతావరణం, వెరసి ప్రకృతి సౌందర్యానికి పుట్టినిల్లుగా చెప్పదగిన ఈ భైరవసెలను స్థానిక అటవికులు బయన్నసెలగా పిలుస్తారు. శ్రీశైలంలోని ప్రధానాలయానికి ఆగ్నేయ దిక్కులో సుమారు 13 కి.మీ. దూరాన ఈ భైరవసెల నెలకొని వుంది. శ్రీశైలం-దోర్నాల మార్గంలో 10 కి.మీ. ప్రయాణించి, అక్కడి నుండి



(దోర్నాల-39 కి.మీ.గా సూచించే మైలురాయి వద్ద) కుడివైపు అడవి మార్గంలో సుమారు 3 కి.మీ. కొండను దిగి ఈ భైరవసెలను చేరుకోవచ్చు. భైరవసెలలో ఒక చిన్న గుహ, ఆ గుహలో అరుదైన రూపంలో భైరవుడు, స్థానిక చెంచుల దేవుడైన బయన్న వుండగా, సెలలో పలుచోట్ల సుమారు ఏడెనిమిది జలపాతాలు వున్నాయి. సహజసిద్ధంగా ఏర్పడిన ఇక్కడి జలపాతాలను చూస్తే శరీరం పులకిస్తుంది. మనస్సు ఆనందంతో నిండిపోతుంది. అయితే వీటి ప్రవాహ ఉధృతిని చూస్తే కొంత గగుర్పాటు కూడా కలుగుతుంది.

కొండగట్టులపై నుండి అంచెలంచెలుగా జారిపడే ఈ జలపాతాల ప్రవాహ శబ్దం సుమారు అరకిలోమీటరు వరకూ వినిపిస్తుంటుంది. ప్రవాహ ఉధృతి వర్షాకాలంలో వున్నంతగా వేసవిలో వుండదు. జలప్రవాహ గమనంలో అక్కడక్కడ బండరాళ్ళ మధ్య నీళ్ళు నిలబడి కోనేర్లలాగా కనిపిస్తుంటాయి. భైరవసెల జలపాతాలు భీముని కొలను చేరి, నీలిగంగరేవు వద్ద కృష్ణానదిని కలుస్తాయి. శ్రీశైల పరిసరాలలో అనేకచోట్ల సహజ జలధారలు వున్నప్పటికీ, భైరవసెలలో వున్నన్ని జలపాతాలు క్షేత్ర పరిధిలో ఒకే చోట మరెక్కడా కనపడవు.

మల్లికాతీర్థం

శ్రీశైలంలోని మహత్తర తీర్థంలో మల్లికాతీర్థం ఒకటి. స్కందపురాణం మల్లితీర్థంగా అభివర్ణించిన ఈ పుణ్యతీర్థం కాలక్రమంలో మల్లెల తీర్థం అని పలవబడి, చివరకు మల్లెలతీర్థంగా స్థిరపడిపోయింది. శ్రీశైలం నుండి 54 కి.మీ దూరంలోని మల్లికాతీర్థాన్ని శ్రీశైలం- హైదరాబాద్ రోడ్డులో ప్రయాణించి చేరుకోవచ్చు. మల్లెలతీర్థానికి చేసే ప్రయాణంలో నడకదారి

4-5 ఫర్లాంగులైనప్పటికీ ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. ప్రశాంత వాతావరణంలో చక్కని శోభతో వెలుగొందే అడవి పక్షుల కిలకిల రావాలు, పరవశింపజేసే చల్లనిగాలి, అన్నీ కలిసి సందర్శకుల హృదయాలను స్పందింపజేస్తాయి. కాలినడకతో మల్లెల తీర్థం లోయలోకి పూర్తిగా దిగిన తర్వాత ఎత్తైన జలపాతం ఎంతో గంభీరంగా కనిపిస్తుంది. సుమారు 120-130 అడుగుల ఎత్తుపై నుండి జాలువారే ఈ జలపాతాన్ని చూస్తే కలిగే ఆనందం అవర్ణనీయం. ఈ జలపాతం కిందకు జారి, కొంచెం ముందుకు ప్రవహించి, పెద్ద సరస్సులాగా ఏర్పడింది. మల్లెలగుండంలోని నీరు ఎంతో స్వచ్ఛంగా వుంటడమే కాక, మండువేసవిలో కూడా ఎముకలు కొరికేంత చల్లగా వుండటం విశేషం. ఈ గుండం చాలా లోతుగా వుందని చెబుతారు. కాబట్టి ఇక్కడ స్నానాలు చేసే సందర్శకులు జాగ్రత్త వహించడం మంచిది.

గుప్తమల్లికార్జునం

శ్రీశైల మహాక్షేత్రపు పరిధిలోని కమనీయ దృశ్యాలలో గుప్తమల్లికార్జునం ఒకటి. అతి విశాలమైన అడవిలో ఎత్తైన కొండలలో, లోతైన లోయలతో, ఎగిరిపడే జలపాతంలో కనువిందు చేసే ఈ గుప్త మల్లికార్జునాన్ని స్థానికంగా 'లొద్ది' అని పిలుస్తారు. కాగా స్కందపురాణం ఈ ప్రదేశాన్ని గుప్త మల్లికార్జునంగా పేర్కొంది. ఈ గుప్తమల్లికార్జునాన్ని సందర్శించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. ఈ ప్రదేశాన్ని కాలినడకతో అయితే శ్రీశైల ఆలయం వెనుకగల పంచమఠాల మీదుగా వెళ్ళి జాతరరేవు వద్ద కృష్ణానదిని దాటి, సంగరిగుండాల, భ్రమరాంబ చెరువు, అప్పాపురం మీదగా చేరవచ్చు. ఇది సుమారు 46 కి.మీ.లు. ఈ మార్గంలో కాలినడకశ్రీ వెళ్లడం ఎంతో కష్టం. ఇది అంత శ్రేయస్కరం అయిన దారి కాదు. ఇక వాహనాలలో వెళ్ళేవారు శ్రీశైలం నుండి అచ్చంపేట చేరుకుని, అక్కడి నుండి చౌటపల్లి మీదుగా గుప్తమల్లికార్జునం(లొద్ది) చేరవచ్చు.

ఈ మార్గంలో శ్రీశైలం నుండి అచ్చంపేట 93 కి.మీ. కాగా, అక్కడి నుండి చౌటపల్లి 6 కి.మీ. చౌటపల్లి వరకు వాహనాలలో నిరాటంకంగా వెళ్ళవచ్చు. అక్కడి నుండి సుమారు 15 కి.మీ. దూరంలో వున్న లొద్దకి అడవిమార్గంలో దాదాపు 13 కి.మీ. (గుర్రాలబండ వరకు) కమాండర్ జీపులో ప్రయాణించి అక్కడి నుండి సుమారు 2 కి.మీ. కొండ అంచున నడిచి, కొండసగభాగం వరకు ఎక్కి లొద్దిని చేరుకోవచ్చు. ఈ మార్గంలో గుర్రాల బండను దాటి కొండ అంచున సుమారు కిలోమీటరు దూరం వెళ్ళాక ఒక పెద్ద ఇనుప నిచ్చెన కనిపిస్తుంది. సుమారు 60 అడుగుల పొడవుగల ఈ నిచ్చెనను ఎక్కి, తరువాత కొండ చరియపై పాకుతూ ఎక్కవలసి వుంటుంది. ఆపై సుమారు ఒక ఫర్లాంగు దూరంలో విశాలమైన ప్రదేశంలో పెద్ద జలపాతం, కింద కోనేరు, దానికి ఆవలివైపు కొండగుహ దర్శనమిస్తాయి.

ఇక్కడి జలపాతం సుమారు 100 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ చూపరుల మనస్సులో ఆనందాన్ని తాండవింపచేస్తుంది. ఈ జలపాతం ఏర్పరచిన కోనేరులోని నీరు వేసవిలో కూడా ఎంతో చల్లగా వుండి మంచునీటిని మరిపిస్తాయి. ఈ గుప్త మల్లికార్జునం, అక్కడి జలపాత సందర్శనం ఒక వింత అనుభూతిని కలిగించి, పర్యాటకుల మదిలో చెరగని ముద్రను వేస్తుంది.

భీముని కొలను

శ్రీశైలానికి గల ప్రాచీనమైన నాలుగు కాలిబాట మార్గాలలో భీముని కొలను మార్గం ఒకటి. పూర్వపు రోజుల్లో శ్రీశైలక్షేత్రానికి దక్షిణ, పశ్చిమ భాగాల నుండి కాలినడకన వచ్చే భక్తులు ఈ భీముని కొలను మీదుగా శ్రీశైలాన్ని చేరేవారు. శ్రీశైల సంస్కృతి, మత అంశాలతో చెప్పలేనంతగా ముడిపడివున్న కన్నడ ప్రజలు ఈ మార్గం ద్వారా శ్రీశైలానికి వస్తుండటంతో ఈ కాలిబాట మార్గం తక్కిన మూడు మార్గాలకంటే కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. భీముని కొలను వెళ్లేందుకు శ్రీశైలం నుండి సుమారు 4 కి.మీ. దూరంలో వున్న హటకేశ్వరం చేరుకొని, అక్కడి నుండి కుడివైపున అడవిదారిలో 2 కి.మీ. ప్రయాణించి కైలాస ద్వారం చేరుకోవాలి. అక్కడి నుండి మెట్లదారిలో సుమారు 850 మెట్లు దిగితే వచ్చే లోయ ప్రాంతమే భీముని కొలను. భీముని కొలను లోయప్రాంతమంతా ప్రకృతి అందాలతో అలరారుతూ, చూపరుల మనస్సును ఎంతగానో ఆకట్టుకుంటుంది. కైలాసద్వారం నుండి సుమారు 2000 అడుగుల లోతులో వుండే ఈ భీముని కొలను లోయచుట్టూ సుమారు 650 అడుగులపైగా ఎత్తులో దట్టమైన కొండలు వ్యాపించి వున్నాయి. లోయకు యిరువైపులా రంపముతో కోసినట్లుగా ఏర్పడిన కొంతభాగం ఎంతో ముచ్చటగా కనిపిస్తుంది. ఈ లోయ పైతట్టు ప్రాంతంలోని కొండల్లోంచి ఉబికివచ్చే సహజ జలధారలు లోయలోని బండరాళ్ళపై ప్రవహిస్తూ జలపాతాన్ని ఏర్పరచాయి.

ఈ జలపాతం ఏమంత ఎత్తు నుండి పడకపోయినప్పటికీ, బండరాళ్ళపై నుండి కిందకు దూకేటప్పుడు వచ్చే ప్రవాహశబ్దం మైమరపింపచేస్తుంది. పచ్చని అడవిలో, తెల్లని నురగలతో జాలువారే ఈ జలపాతం పర్యాటకులను ముగ్ధుల్ని చేస్తుంది. ఈ ప్రవాహమంతా కోనేరులాగా కన్పించే భీముని కొలనును చేరి, పొంగిపొర్లుతుంటుంది. వర్షాలు విస్తారంగా కురిసినప్పుడు ఈ ఉధృతి మరింతగా ఉంటుంది. భీముని కొలనులో ప్రవహించే నీరంతా నీలిగంగరేవు వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ★



కరిగిపోయిన ... కదులుతున్న కాలంలో ... వనితకు కనకానికి వున్న బంధం విడదీయరానిది. పండుగలు, శుభకార్యాల సమయంలో నగలు ధరించి హడావిడి చేసే ముచ్చట చెప్పనలవికానిది. అయితే ఇవాళ పుత్తడి ధర కొనేట్టుందా! పెట్టుకొనేట్టుందా!! పట్టపగలే చుక్కలు చూయిస్తోంది. తులం బంగారం 20 వేల రూపాయల వరకు పలుకుతోంది. బంగారం ధర పెరిగిందని ఆభరణాలు పెట్టుకోవడం మానేశారా! దానికో దగ్గర దారి వెతికారు. తమ బడ్జెట్‌కు అందుబాటులో లభిస్తున్న వన్‌గ్రామ్ గోల్డ్ వైపు మొగ్గారు. అది గోల్డా... రోల్డు గోల్డా...వన్‌గ్రామ్ గోల్డా కాదు. ఆభరణాలు పెట్టుకొన్నామా లేదా? మోజు తీరిందా లేదా? అనేదే నేటి ట్రెండ్‌గా వుంది. వన్‌గ్రామ్ గోల్డ్ నగల తళుకు బెళుకుల గ్లామర్ ఈ వారం అట్టమీది కథలో...

వన్‌గ్రామ్ మెరుపులే!

- కె.అంజన

సినిమాల్లో, ప్రకటనల్లో పెళ్లికూతురు ఎలా నడిచొస్తుంది? కంచిపట్టు చీరకట్టి, మెడలో హారాలు వేసుకొని, చేతికి వంకీలు, నిండుగా గాజులు వేసుకొని, నడుముకు వడ్డాణం చుట్టుకొని నుదుటిన పాపిడిబిళ్ల పెట్టుకొని, చెవులకు వేళ్లాడే జుంకీలు, చెంపసవరాల్ని అలంకరించుకొని బంగారు పట్టీలు ఘల్లుఘల్లుమని మోగుతుండగా, పసిడి జడకుప్పెలతో సిగ్గులొలుకుతూ కదిలివస్తుంటుంది. 90 ఎంఎం తెరమీద క్లోజప్పులో ఒక్కో నగనూ చూయిస్తుంటే ఏముంది! థియేటర్లో కూర్చున్న మహిళా ప్రేక్షకుల కళ్లు రెప్ప వేయడం కూడా మర్చిపోతాయి. ఆ పాత్రలో తమను ఊహించేసుకొని ఎప్పటికైనా అన్ని నగలను అలంకరించుకొని పెళ్లి పందిరిలో సందడి చేయాలని యువతులు కలలు కన్నా ఆశ్చర్యంలేదు. ఇవాళ మధ్య, కింది తరగతి కుటుంబాల్లో ఇవన్నీ సాధ్యమయ్యేలా వున్నాయా! బంగారం ధర అందక పొందక ఊరిస్తోంది. ఇక్కడ బ్రేక్ పడిన బిజినెస్‌ను ఫుల్లుగా పరుగులెత్తించేందుకు ఒన్‌గ్రామ్ గోల్డ్ నగలను మార్కెట్లోకి దించేశారు. రాజధానిలో ఎకాఎకిన అపార్ట్‌మెంట్లలోకే తీసుకొచ్చి అమ్మకానికి పెడుతున్నారు. అంటే మార్కెట్ దాకా రాని వారిని కూడా ఆకట్టుకొని కొనిస్తున్నారన్నమాట. అచ్చం పుత్తడిలా మెరిసిపోతున్న ఆకర్షణీయమైన డిజైన్ల నగలు కళ్లెదుట కన్పించడంతో వాటి వాడకమూ పెరిగిపోయింది.

ప్రకటనల ప్రభావం ఇంతింత కాదయా!

టీవీలో ఏ చానలైనా పెట్టండి. ఏ పత్రికైనా చూడండి. ఏ బజారైనా వెళ్లండి. కళ్లు చెదిరిపోయే బంగారు నగల ప్రకటనలు కనిపిస్తాయి. మనసును కట్టిపడేస్తాయి. యాడ్‌లో పిల్లలు, యువతులు... వంటి నిండా నగలు పెట్టుకొని హొయలొలికిస్తుంటారు. మరీ ఈమధ్య బ్యాంగిల్ మేళా, వడ్డాణాల మేళా అని ప్రత్యేక ప్రకటనలు గుప్పిస్తున్నారు. చేతినిండా గాజులేసుకొని ఎరోబిక్స్ క్లాసుకెళ్లిన అమ్మాయినే అందరూ మైమరచిపోయి చూస్తుంటారు. బెడ్‌కాఫీ అందించే భార్య చేతినిండా వున్న బంగారు గాజులు చూచి భర్త ఆశ్చర్యానందాలకు గురౌతాడు. క్లాసులో పాఠాలు చెప్పే టీచర్ చేతినిండా వున్న పుత్తడి గాజులను క్లాసులో విద్యార్థులు కళ్లప్పగించి చూస్తుంటారు. ఇలాంటి ప్రకటనలు చూశాక ఆగతరమా! పుత్తడి కొనకపోయినా కనీసం చవగ్గా అందుబాటులో వున్న వన్‌గ్రామ్ గోల్డు నగలైనా కొనుక్కుందా మనుకునేవారు ఎందరో. ఇవేనా! సినిమాల ప్రభావమూ తక్కువకాదు. 'దేవదాసు, ఉమ్రావ్‌జాన్, అరుంధతి, వరుడు...' చిత్రాలలో 'మాధురీదీక్షిత్, ఐశ్వర్యారాయ్, అనుష్క, భాను మెహ్రా...' ధరించిన నగలు మహిళలను బాగా ఆకట్టుకున్నాయి. వేసుకొంటే అలాంటి నగలే వేసుకోవాలన్నంత ముద్ర వేసేశాయి. ఇవేనా! బాలీవుడ్ సినిమాలు, సీరియళ్లలోని హీరోయిన్లు, ఇతర ప్రధాన పాత్రధారుల ద్వారా ఈ నగలకు మంచి ప్రాచుర్యం లభించింది. మార్కెట్లో వన్‌గ్రామ్ గోల్డ్‌లోనూ అలాంటి ఆభరణాలు అందుబాటులో వుండడంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. ఒకవేళ షాపువాడు ఆ డిజైన్ నగలు చూపించకున్నా అడిగిమరీ కొనుగోలు చేస్తున్నారంటేనే వారి మనసులను ఎంత బాగా కొల్లగొట్టాయో తెలిసిపోతోంది. మార్కెట్ మంత్రం ఎంత సులభంగా పనిచేసిందో అర్థమౌతోంది.

వన్‌గ్రామ్ గోల్డ్ ఎలా వచ్చింది?

మనకు మన్‌గ్రామ్ గోల్డ్ గురించి నాలుగైదేళ్ల నుంచి తెల్సేమో! కానీ ఉత్తరాది రాష్ట్రాలలో ఎప్పటి నుంచో వుంది. హిందీ సీరియళ్లలో పాత్రధారుల వల్ల మనకూ పరిచయమయ్యాయి. చీరలకు మ్యాచయ్యేలా పెట్టుకొనే జైపూర్ రాళ్ల నగల మెరుపులు దేశవ్యాప్తంగా అమ్మాయిలను ఆకర్షించాయి. దాంతో మన రాజధానిలోనూ వాటి అమ్మకాలు, వాడకం ఊపందుకొంది. ఉత్తరాది

డిజైన్లే కాదు, దక్షిణాది సంప్రదాయ డిజైన్లూ, టెంపుల్ జ్యుయెలరీ డిజైన్లూ వస్తున్నాయి. ఏదేమైనప్పటికీ మీనాకారీ, కుందన్‌కారీ పనితనం నింపుకున్న యాంటిక్ డిజైన్లదే రాజ్యం. వీటినే మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. బంగారు నగ ఏదో, వన్‌గ్రామ్ బంగారు నగ ఏదో తెలుసుకోవడం కష్టమే. రు200 నుంచి రు10 వేల రూపాయల వరకు పలుకుతున్నాయి. అందులో వాడిన రాళ్లు, ముత్యాలు, పగడాలు, రత్నాలు, వజ్రాల నాణ్యతను బట్టి వాటి ధర పలుకుతుంది. ఖరీదైన ముడిసరుకు వాడితే ధర ఎక్కువ వుంటుంది. చవకబారువి వాడితే తక్కువకే అందుతాయి. వన్‌గ్రామ్ గోల్డ్ నగలను రాగి లేదా వెండితో చేస్తారు. అదీ ఇదీ కాకపోతే రెండూ కలిపి కూడా చేస్తారు. అంతా అయ్యాక ఒక గ్రాము బంగారం పూత పూస్తారు. సరిగ్గా 24 క్యారట్ల బంగారమే పూస్తారు. రోల్డ్‌గోల్డ్ నగలకు కూడా బంగారం పూస్తారు. కానీ ఈ పూత ఎంత పల్చగా వుంటుందంటే 0.000007 అంగుళాలకన్నా తక్కువ. ఆ బంగారం కూడా 24 క్యారట్ల బంగారం కాదు. ఏ ఎనిమిదో, పదో క్యారెట్లదై వుంటుంది. అందుకే వెండితో చేసిన వాటి ధర కొంచెం ఎక్కువ వుంటుంది. అయితే వెండి, రాగి మీద మీద పుత్తడి పూత ఎక్కువకాలం మన్నుతుంది. అందుకే ఈ నగలు కూడా మన్నికగా వుంటాయి. ఎంతో కాలంగా రోల్డ్‌గోల్డ్ నగల తయారీకి ప్రాచుర్యం పొందిన చిలకలపూడిలో ప్రస్తుతం వన్‌గ్రామ్ గోల్డ్ నగలు కూడా చేస్తున్నారు. ఈ వన్‌గ్రామ్ నగలు ముంబై, ఢిల్లీ వంటి మహా నగరాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

ఇప్పుడిదే ట్రెండు

పది పదిహేనేళ్ల కిందట మధ్య తరగతి మహిళల ఆలోచన ఇలా వుండేదికాదు. అచ్చమైన పుత్తడిపైనే వారి మనసు తూగేది. సన్నపాటిదైనా సరే అచ్చమైన బంగారునగ వేసుకోవడానికే మొగ్గుచూపేవారు. గిల్టు నగ వేసుకోడానికి సుతరామూ ఇష్టపడేవారుకాదు. పైగా గిల్టు నగలు పెట్టుకున్న వారి పట్ల చులకన భావం కూడా వుండేదప్పట్లో. దాంతో కట్టుతీగతో చేసిన ముత్యాలహారం వేసుకోవాలన్నా వెనకాముందూ ఆలోచించేవారు. అలాంటిది ఇవాళ కింది, మధ్యతరగతి వారేకాక ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం వన్‌గ్రామ్ గోల్డ్ నగలు వాడేస్తున్నారు. ఏదైనా పెళ్లిలో వంటినిండా నగలు దిగేసుకొచ్చిన వారిని చూచి అంతా బంగారమే అనుకొంటే ఇత్తడైపోగలం. అవీ ఇవీ కలగాపులగంగా వేసుకొనేవారు, అచ్చంగా ఇవే వేసుకొని దర్జా వలకబోసేవారూ అందరూ వున్నారు. సింపుల్‌గా వున్నా అచ్చమైన గోల్డే వేసుకోవాలన్నది అప్పటి మాట. గిల్టో, గోల్డో వంటి నిండా నగలుండాలన్నది నేటి ట్రెండు. బంగారంతో పోలిస్తే ధర చాలా తక్కువ కావడంతో రకరకాల నగలు కొనేస్తున్నారు. పిల్లల ముచ్చట తీర్చుతున్నారు. మార్కెట్లో ఇప్పుడు నగల దుకాణాలను మించి వన్‌గ్రామ్ జ్యువెలరీ షాపులు దర్శనమిస్తున్నాయి. పెళ్లికి కావాల్సిన దుస్తులు, నగలు, ఇతరత్రా అన్నీ ఒకేచోట లభిస్తుండడంతో మగువలకు ఇవి మరింత దగ్గరయ్యాయి.

దుస్తులకు తగ్గ నగలు

బంగారం ధర వింటే చాలు చుక్కలు కనిపిస్తున్నాయి. అయినా సరే మగువల మనసు మాత్రం ఆభరణాలను కోరుకుంటూనే వుంటుంది. అవి అచ్చ బంగారు నగలా! ఒక గ్రాము బంగారు నగలా!! అనేది తర్వాతి విషయం. ఏవైనా సరే...బట్టలకు నప్పే నగలు వేసుకోవాలంతే. ఏ రంగు చీరలు వేసుకుంటే వాటి మీదికి సూటయ్యే నగలు ఎంపిక చేసుకొని వేసుకోవాలనుకునే ట్రెండ్ పెరిగింది. వాటిలో ఉపయోగించే కుందన్లు, రాళ్లు, ముత్యాలు పొదిగిన వన్‌గ్రామ్ నగలను ధరించడానికి సుముఖత చూయిస్తున్నారు. పెళ్లిళ్లలో అయితే పిల్ల పేరంటాళ్లుకూడా నిండుగా నగలతో ముస్తాబవ్వాలని కోరుకుంటున్నారు.

ఇదే ఎందుకు?

బంగారం ధర కొనేలాగా వుందండీ! అయినాసరే...! పెళ్లో-పేరంటమో, పండగో-పబ్బమో, శుభకార్యాలో-ప్రయాణాలో వచ్చాయంటే కంటికి నచ్చిన బట్టలు, వాటికి సూటయ్యే నగలు ఎంపిక చేసుకోవాలి. ఇలా ఒకటేంటి? పుట్టినరోజులు, పెళ్లిరోజులు కాలేజీ ఫంక్షన్లూ, ఫెయిర్‌వెల్ పార్టీలూ...కావేవీ అలంకరణకు అనర్హం. మరి మన బడ్జెట్‌లో ఆ కోరిక తీరాలంటే వన్ గ్రామ్ గోల్డే దిక్కు. పుత్తడితో పోటీపడుతూ వన్‌గ్రామ్ డిజైన్లు అనేకం లభిస్తుండడంతో వాటిని ఆశ్రయిస్తున్నారు. తక్కువ ధరలో ఎక్కువ అందంగా చూపించే ఈ నగల పట్ల మగువలు ముచ్చటపడుతున్నారు. ఇవాళ బంగారు నగలు వేసుకొని బయటికెళ్లాలంటే భయం. బిక్కుబిక్కుమంటూ వెళ్లినా ఆ నగలు వెనక్కి వస్తాయో రావోనని పీకులాట. చైన్ స్నాచర్లు పెరిగిపోయారుమరి. అదే వన్‌గ్రామ్ గోల్డ్ నగలైతే బస్సులు, రైళ్లల్లో కూడా నిర్భయంగా ప్రయాణం చేయవచ్చన్నది మగువల మనసులోని మాట. సాధారణంగా కాలేజీ అమ్మాయిలు ఫ్యాషనబుల్‌గా వుండే వివిధ డిజైన్ నగలకే ఓటు వేస్తారు. వీరిని తమను మంత్ర ముగ్ధులను చేసే ముత్యాల దండలు, రౌండ్ మోడ్ దండలు, రైస్ మోడల్, కెంపులు, పచ్చలు, పింక్ పెరల్స్, డ్రాప్స్ వంటి మోడల్ దండలు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. గ్లాస్ కటింగ్, బరానీ, గోపీచైన్స్, ఊర్వశి కటింగ్, కొబ్బరితాడు చైన్లు కాలేజీ యువతులను ఆకట్టుకుంటున్నాయి. సరసమైన





రోల్డ్‌గోల్డ్ కత...

వన్‌గ్రామ్ గోల్డు– రోల్డ్‌గోల్డు నగల తయారీకి కొద్దిగా తేడా వుంది. రోల్డుగోల్డు పరిశ్రమ వంద సంవత్సరాల క్రితమే కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రారంభమైంది. ఇది మన రాష్ట్రంలో కుటీర పరిశ్రమగానే కొనసాగుతోంది. సుమారు 80 వేల మంది కార్మికులు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ వృత్తిని వంశపారంపర్యంగా చేస్తున్న కుటుంబాలే ఎక్కువ. రోల్డుగోల్డు ఆవిర్భవించిన కొత్తలో వెండి, ఇత్తడితో ముడి నగ తయారు చేసి దానిపైన బంగారం రేకుతో తాపడం చేసేవారు. క్రమేణా ఇత్తడి స్థానంలో రాగి, తాపడం స్థానంలో గోల్డు కోటింగ్ ప్రవేశించాయి. దశాబ్దం క్రితం నుండి ఇనుము, ఎనామిల్

కోటెడ్ వినియోగంలోకి వచ్చాయి. మొదట్లో పిన్నీసులు, గుండీలు, గాజులు, దిద్దులు, చెయిన్‌లు వంటివి తయారుచేసేవారు. ప్రస్తుతం అన్ని రకాల ఆభరణాలను తయారు చేస్తున్నారు. 1980 నుండి 2000 వరకు రోల్డుగోల్డు వ్యాపారం మందగించినప్పటికీ ఆ తర్వాత తిరిగి పుంజుకుంది. ప్రస్తుతం ఒంటికి ధరించే దుస్తులకు మ్యాచింగ్ అయ్యే నగలు కూడా అందుబాటులోకి రావడంతో కొనుగోళ్లు పెరిగాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కలకత్తా, ఒరిస్సా, కేరళ, రాష్ట్రాలతో పాటు అమెరికా, జపాన్, సింగపూర్, హాంకాంగ్, నేపాల్ తదితర దేశాల్లో ఎగుమతి చేస్తున్నారు. మద్రాస్, బెంగుళూరు, హైదరాబాద్ సినీ ఇండస్ట్రీకి ప్రత్యేక ఆర్డర్‌లపై నగలు డిజైన్ చేసి పంపుతారు. ఇది నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది.

–ఎం.వి.ఆంజనేయులు, కృష్ణా జిల్లా.

ధరలకే ఇవి అందుబాటులో వుండడంతో వన్‌గ్రామ్ వైపే మొగ్గు చూయిస్తున్నారు. సరసమైన ధరల్లో అందుబాటులో వుండడమే కాక, షాపువాళ్లు గ్యారంటీ కూడా ఇస్తుండడంతో వీటిపట్ల మోజుపడుతున్నారు. అవసరమనుకొన్న వెంటనే మార్కెట్లో లభిస్తుండడం వల్ల కూడా వీటిని ఇష్టపడుతున్నామని చెప్పేవారూ వున్నారు. మహిళలకే కాదు! మగవారికోసం కూడా ....పచ్చ రాయి, పగడం, పింకురాయి, దేవుడి బొమ్మలతో రూపుదిద్దుకున్న ఉంగరాలూ లభిస్తున్నాయి. వీటి ధర రు40 నుంచి 70 రూపాయల వరకు పలుకుతోంది.

ధరల్లో ఎంత తేడా!

ఇప్పుడు కుందన్, యాంటిక్ డిజైన్ నగలదే హవా అంతా. రాజస్థాన్, బెంగాల్ నుంచి వచ్చే నక్లెస్‌లంటే మోజు. బంగారు జడ, వంకీలు, వడ్డాణాలు, పగిడీలు, హారాలు, నక్లెస్‌లు, గాజులు, జుంకాలు...ఒకటేంటి...అన్నీ అలంకరించు కోవాలనుకుంటున్నారు. మరి ఇవన్నీ బంగారపువైతే ఎంత ఖరీదు పలుకుతుంది? వన్ గ్రామ్ గోల్డ్‌వైతే ఎంత ధర వుందో చూద్దామా!

పెళ్లికుమార్తె సెట్టు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ సెట్‌లో నెక్లెస్‌లు, చైన్లు, చెవి దిద్దులు, ఉంగరాలు, గాజులు... ఇతర నగలుంటాయి. ఒక్క నెక్లెస్ ధర రు.150 నుంచి రు.5000 వరకు పలుకుతుంది. ఇంక పెళ్లి కుమార్తె సెట్టు ధర రు.3000 నుంచి 5000 వరకు పలుకుతుంది. ఇప్పుడు కుందన్, యాంటిక్ డిజైన్ నగలదే హవా అంతా. రాజస్థాన్, బెంగాల్ నుంచి వచ్చే నక్లెస్‌లంటే మోజు. అమ్మాయిలు ఎక్కువగా యాంటిక్ నెక్లెస్‌లనే ఎక్కువగా కొంటున్నారు. పుత్తడి కుందన్ సెట్టు రు.2 లక్షల నుంచి రు.10 లక్షల వరకు పలుకుతుంటే యాంటిక్ సెట్టు రు. 1 లక్ష నుంచి రు. 3 లక్షల వరకు వుంది. రాళ్లు పొదిగిన బంగారుజడకు డిమాండ్ బాగా వుంది. ఇవేకాక సాదా జడలూ అమ్ముడుపోతున్నాయి. బెంగాలీ జడలు మార్కెట్లో లభిస్తున్నాయి. 24 క్యారట్ల బంగారు జడ 2 నుంచి 4 లక్షల రూపాయల వరకు వుంటే వన్ గ్రామ్ గోల్డ్ జడ రు.1800 నుంచి రు.4000 వరకు వుంది. వంకీలు కూడా రాళ్లు పొదిగినవి, అచ్చంగా బంగారు డిజైన్లవి రెండూ వున్నాయి. బంగారు వంకీలు రు.30 వేల నుంచి లక్ష వరకు పలుకుతుండగా, ఒన్ గ్రామ్ గోల్డ్‌వి రు.600 నుంచి రు.2000 వరకు వున్నాయి. ఇప్పుడు వరుడు సినిమాలో హీరో ధరించిన బాసికాలకు డిమాండ్ వుంది. జనాలు వీటిని అడిగి మరీ కొనుగోలు చేస్తున్నారు. వన్‌గ్రామ్ గోల్డ్ బాసికాలు రు.75 నుంచి రు.450 వరకు పలుకుతున్నాయి. మార్కెట్లో సంప్రదాయ, ఫ్యాన్సీ వడ్డాణాలు వున్నాయి. ఆకుపచ్చ రాళ్ల వడ్డాణాలు, లక్ష్మీదేవి వడ్డాణాలకు డిమాండ్ ఎక్కువ. బంగారు వడ్డాణం 3 లక్షల నుంచి 6 లక్షల రూపాయల వరకు పలుకుతుండగా వన్‌గ్రామ్ గోల్డ్ వడ్డాణం రు.400 నుంచి రు.1300ల్లోనే లభిస్తోంది. ఏవైనా తడి తగలకుండా జాగ్రత్తగా వాడుకుంటేనే ఎక్కువకాలం మన్నుతాయి. మన జాగ్రత్తను బట్టే ఖర్చు కూడా.

గిల్టు నగల పిచ్చి ముదిరితే...

ఏ డ్రెస్సు మీదకు సూటయ్యే నగలు ఆ డ్రెస్సు మీదకు వేసుకోవాలనే ధోరణి ఇవాళ చాలా ఎక్కువగా వుంది. పెద్దలు కూడా "పిల్లలు మననేమన్నా బంగారం కొనిపెట్టమన్నారా! మనకు అందుబాటులో వున్న వన్‌గ్రామ్‌వే కదా, రోల్‌గోల్డ్‌వే కదా. మనకూ భారం కాదు. వాళ్ల ముచ్చటా తీరుతుంది" అని కొనిస్తున్నారు. ప్రతి నెలా బడ్జెట్‌లో ఉప్పు, పప్పు, బియ్యానికి కేటాయించినట్టు ఈ నగలకు ఖర్చు చేసేవారూ తయారౌతున్నారు. ఎక్కడికైనా పేరంటానికి వెళ్లాలీ అంటే చాలు మెడలోకి గిల్టు నగ కొనాల్సిందే. తీరా వేశాక దాన్ని తీయబుద్ధికాదు. దాంతో అది చాలా త్వరగా తెల్లబడిపోతుంది. మళ్లీ ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాలీ అంటే తిరిగి నగ కొనాల్సిందే. "మెడలోకి ఏదోఒకటి లేకపోతే ఎట్లా. నవ్వరూ" అంటూ కొనేస్తుంటారు. పుత్తడైనా... ఇత్తడైనా ...నగల పిచ్చి అంతా ఇంతా కాదు. వదలదు. పైగా కొత్త డ్రెస్సు కొన్నప్పుడల్లా ఆ నగలు కొనిపడేస్తుంటే ... ఇల్లు చాలదు. ఎక్కడ చూచినా అవే కనిపిస్తాయి. వెనక సీలలు పోయిన పోగులు, రాళ్లు ఊడిన దిద్దులు, నెక్లెస్‌లు, వెలిసిపోయిన గాజులు, విరిగిపోయిన, వంగిపోయిన నగలు... అలా ఎక్కడంటే అక్కడ దర్శనమిస్తుంటాయి. తీరా మళ్లీ వేసుకోబోతే ఏదీ సరిగా వుండదు. కొనేటప్పుడున్న శ్రద్ధ వాటిని ఉపయోగించేటప్పుడు, భద్రపరచుకునేటప్పుడు వుండకపోతే ఇలాగే జరుగుతుంది. ఫంక్షన్లకు వేసుకెళ్లాక వాటిని జాగ్రత్తగా తీసి భద్రపరుచుకోకుండా...అలసిపోయి బద్ధకంగా అలా వాటిమీదే మంచంలో వాలిపోతే, వేసుకున్న తర్వాత తీసే అలవాటు లేకపోతే పరిణామాలు ఇలానే వుంటాయి. సులభంగా పాడైపోతాయి. వాటి మీద ఎంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందో లెక్క రాసుకుంటే మనకే తెలుస్తుంది. కడుపునిండా తిన్నదీ కాదు. కూడబెట్టిందీ కాదు. ఈ పిచ్చిని వదిలించుకోకపోతే ఆగమైపోయేది మనమే. ★

దెబ్బలు పడాల్సిందేనా!

అఖిల్, నిఖిల్ పెద్దగా అరుచుకుంటూ ఒకరి వెంట ఒకరు పరిగెడుతున్నారు. ఒకరికొకరు అందితే చాలు ఫైటింగ్ జరిగిపోయేలా వుంది. ఈలోగా పద్మిని రంగప్రవేశం చేసి....

"అయ్యో! పొద్దస్తమానం ఇలా తన్నుకోవడమేనా! చదువుకునేదేమైనా వుందా?"

"అమ్మా... చూడు వాడు నా కారు తీసుకొని ఇవ్వనంటున్నాడు. అసలు నా బొమ్మ వాడెందుకు తీసుకోవాలంట?" రొప్పుతూ ప్రశ్నించాడు అఖిల్.

"ఆ...పెద్ద నీది! నువ్వైతే నా బొమ్మలతో ఆడుకోవచ్చు. నేనైతే నీ బొమ్మ ముట్టుకోకూడదా...దా...వచ్చి అందితే తీసుకెళ్లు" అంటూ మళ్లీ పరుగు లంకించుకొన్నాడు నిఖిల్.

"రేయ్ ...నిఖిల్‌గా నువ్వుగాని చిక్కావంటే నా చేతిలో అయిపోయావే..." వుండు వస్తున్నా...అనుసరించాడు అఖిల్.

తన మాట వినిపించుకోకుండా ఇంకా తమ గొడవను కొనసాగిస్తున్న పిల్లలను చూసి పద్మినికి చిర్రెత్తుకొచ్చింది.

"రేయ్ ... మీరు మాటలతో వినర్రా. ఒంటికి చురుకు తగిలితేగానీ మీకు నేను చెప్పింది ఎక్కదు....చదువుకోమని చెప్తున్నా...గోల ఆపరా!"

అంటూ ఇద్దర్నీ పట్టుకొని చెరో రెండూ అంటించింది. అంతే...అప్పటి వరకు పిల్లల కేరింతలతో ప్రతిధ్వనించిన ఇల్లు కాస్తా మూగబోయింది. ఇద్దరూ అమ్మ ఆజ్ఞ ప్రకారం పుస్తకాలు తీసుకొని చెరో కుర్చీలో కూలబడ్డారు.

"కోతి మూక! నోటితో ఎంత చెప్పినా వినిపించుకోలేదుగానీ... రెండు దెబ్బలు పడేసరికి లైన్లోకి వచ్చేశారు" తను కోరుకున్నది జరగడంతో పద్మిని మనసు శాంతించింది. వారిని తృప్తిగా చూసుకొని వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఇది ఒక్క పద్మిని అభిప్రాయమే కాదు...చాలామంది ఇదే అనుకొంటారు. పిల్లలను కొడితే గానీ చెప్పినమాట వినరనీ, వారికి క్రమశిక్షణ నేర్పడానికి కూడా అదో మార్గమనీ భావిస్తుంటారు. మరీ ముఖ్యంగా వెనకటి రోజుల్లో దీన్ని బాగా నమ్మేవారు. కొడితేనే పిల్లలకు క్రమశిక్షణ బాగా అబ్బుతుందనుకొనేవారు. పిల్లలను బాగా దండిస్తేనే చదువు ఒంటబడుతుందనుకొనే ఉపాధ్యాయులూ తక్కువేం కాదు. తాము చదువుకు రమ్మన్నది చదువుకు రాకపోతే కఠిన శిక్షలు వేసేస్తారు. చేతి వేళ్లమీద స్కేలుతో కొట్టడం, ఎండలో చొక్కాల్లేకుండా నిలబెట్టడం, గోడకుర్చీలు వేయించడం సర్వసాధారణంగా చూస్తుంటాం.

అయితే తల్లిదండ్రులుగానీ, ఉపాధ్యాయులుగానీ పిల్లలను కొట్టడం వల్ల అదనంగా ఒనగూడే ప్రయోజనాలేం వుండవు. పైగా శారీరకంగా పదేపదే హింసించడం వల్ల పిల్లలు మరింతగా మొద్దుబారిపోతారు. ఉద్రిక్త స్వభావులుగా, కోపిష్టులుగా మారిపోయినా ఆశ్చర్యంలేదు.

మూడు నాలుగేళ్ల పిల్లలకు పెద్దలు ఎందుకు కొడుతున్నారో కూడా అర్థంకాదు. దాంతో తమను పదే పదే కొడుతున్న వారిని చూచినా, వారు దగ్గరకు వస్తున్నారన్నా భయపడే ప్రమాదముంది. అందుకే ఆ వయసు పిల్లలు సరిగా చదవడం లేదనో, అల్లరి చేస్తున్నారనో, క్రమశిక్షణగా మెలగడం లేదనో కొట్టడం సరైన పద్ధతికాదు. పైగా అనవసర భయాలను పెంచుకొని చిన్న చిన్న విషయాలకు కూడా భయపడుతుంటారు. సున్నిత మనస్సులు విరిగిపోయి... పిరికివారిగా తయారౌతారు. ధైర్యంగా ఏ పనీ చేయలేని స్థితికొస్తారు. వారిలో ఆత్మవిశ్వాసం కూడా సడలిపోతుంది. పైగా తాము కూడా తోటి పిల్లలను కొట్టడం నేర్చుకుంటారు. అలా చేస్తేనే పనులు అవుతాయని విశ్వసించినా ఆశ్చర్యంలేదు. పెద్దలు పిల్లలను కొట్టడం వల్ల ఇరువురి మధ్య ఆప్యాయతానురాగాలు సన్నగిల్లే అవకాశముంది.

అందుకే చిన్నారులను కొట్టి దారిలోకి తేవాలనుకోవడం కంటే...ఇతర మార్గాలను ఎంచుకోవడం మంచిది. బెదిరించి, భయపెట్టి, కొట్టి నేర్పలేని వాటిని మంచిమాటలతో, మారు మార్గాలతో చేయవచ్చు. కొన్ని దేశాల్లో పిల్లలను కొట్టడం నేరంగా కూడా ప్రకటించారు. భయానికి తావులేని చోట అంటే స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లల సృజనాత్మకత వేయి పూవులై విరుస్తుంది. వంద నవ్వులై వెలుగొందుతుంది. ఏమంటారు!

-కె.చరిత

కథ

శ్వేత మనోగతం

- కత్తి పద్మారావు

నా పేరు శ్వేత. మా ఫరమ్స్ అన్ని నాగార్జున, సిద్దార్ధ పేర్లతో వున్నాయి కాబట్టి మా డాడీ నా పేరు సుజాత పెట్టమని అన్నారట. అయితే పేరు మోడ్రన్‌గా వుండాలని నాకు ఈ పేరు పెట్టారు. తాను అన్ని విషయాలు మోడ్రన్‌గానే ఆలోచిస్తారు. నాకు మూడేళ్లప్పుడు మేము హైద్రాబాదు వచ్చాం. మాది నక్లెస్ రోడ్డులో ఇల్లు. మమ్మీ ఎప్పటికప్పుడు మోడ్రన్ ఆర్కిటెక్చర్స్‌తో ఈ ఇంటిని మోల్డ్ చేస్తూనే వచ్చారు. తనకి వైట్ డాగ్స్ అంటే చాలా యిష్టం. చిన్న పిల్లల కంటె కూడా వాటితోటే ఎక్కువ గడుపుతారు. నేను ఇప్పుడు కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నాను. నేను వేసుకునే బట్టలన్నీ అమెరికాలో వున్న మా అన్నయ్య వాళ్ళు పంపిస్తారు. మమ్మీ ఇండియన్ గూడ్స్ పెద్దగా వాడరు. డాడీ సుమారు రెండు ఫ్యాక్టరీల పని చూస్తా వుంటారు. నిజానికి మార్నింగ్ నేను చూడకుండనే వెళతారు. ఈవినింగ్ కొన్నిసార్లే డాడీని చూస్తాను. మమ్మీ కూడా చాలా బిజీగా వుంటారు. మోడ్రన్ రిక్రియేషన్ క్లబ్‌లో మెంబర్. తను బ్యూటీపార్లర్‌కి వెళ్ళి డ్రై చేసుకొని స్విమింగ్ సెంటర్‌కు వెళ్ళి జిమ్‌కి వెళ్ళి 8-30ని॥లకు ఇంటికి వస్తారు. నేను అప్పుడు కాలేజికి వెళ్ళే టైం. మమ్మీకి 40 సంవత్సరాలైనా తను బాగా యంగ్‌గా కనిపిస్తారు. బ్రేక్‌ఫాస్ట్ చేసే టైంలో తను వస్తే ఏమీ తిననివ్వరని ముందే తినేస్తాను. తను ఒక ఇడ్లీ కంటె ఎక్కువ తింటే ఒప్పుకోరు. ఎక్కువ జ్యూస్ తాగాలని చెప్తారు. నా బాడీ స్లిమ్‌గా వుండటం కోసం అనేక వ్యాయామ వస్తువులు కొన్నారు. కాని బద్దకం వల్ల నేను అవి వాడటం లేదు. తాతయ్య వృద్ధాశ్రమంలో వుంటారు. డాడీ నేను ఆదివారం వెళ్ళి చూసి వస్తాం. ఆయన నా నొసలు ముద్దు పెట్టుకుంటారు. ప్రేమకు సంబంధించిన అనుభూతి అది ఒక్కటే నాకు తెలుసు. మమ్మీ ఎక్కువ కోప్పడతారు. డాడీ లేని టైం చూసి 'మీ మమ్మీ చూడక నాయనమ్మ చనిపోయింద'ని తాతయ్య చెప్తుంటారు. మాకు ఎవరైనా చుట్టాలు వచ్చినా డాడీ వాళ్ళను హోటల్లోనే దించుతారు. డాడీ వారితోనే హోటల్లో భోజనం చేస్తారు. మా అత్తయ్య వాళ్ళు ప్రేమగా అరిసెలు వండుకొస్తారు. మమ్మీ వాటిని తిననివ్వదు. 'అవి సరిగా చేయరు. వాళ్ళు శుభ్రంగా వుండరు' అంటూ వాళ్ళు వెళ్ళాక పనిమనుషులకు ఇస్తుంది. మా ఇంటి నిండా కుక్కలు వుండటంతో తొందరగా మా యింటికి ఎవరూ రారు. అన్నయ్య వాళ్ళు యు.ఎస్.ఎ నుండి సెలవులకు వచ్చేటప్పుడు ఎక్కువ పర్‌ఫ్యూమ్స్, బట్టలు రకరకాలు తీసుకొస్తారు. మమ్మీ తన ఫ్రెండ్స్‌ని పిలిచి ప్రజెంటేషన్స్ ఇస్తుంది. 'ఊళ్ళో వ్యవసాయం చేసే అంకుల్ వాళ్ళకు ఇవ్వొచ్చుకదా'? అని డాడీ అంటే 'వాళ్ళకు వాడుకోవడం రాద'ని మమ్మీ అంటుంది. మమ్మీ ప్రవర్తన నాకు ఆశ్చర్యం వేస్తుంది. మన అన్న వాళ్ళందర్నీ దూరం చేస్తుంది. తన స్టేటస్‌కు తగ్గా వాళ్ళందరికి వస్తువులు ఇస్తుంది. మమ్మీకు కూడా ప్రేమ హృదయం వుంది. ఆమె ఎక్కువ తన పెంపుడు కుక్కల విషయంలోనే జాగ్రత్తగా వుంటుంది. మా కాలేజీలో అనూష, మృదు, నీత అనే స్నేహితులు వున్నారు. అనూష సెల్‌ఫోన్స్‌లో ఫ్రెండ్స్‌ని ఏడిపిస్తూ వుంటుంది. ఎందుకే అలా చేస్తావు అంటే వాళ్ళు మాత్రం చదువుకోవడానికి వచ్చి ఆడపిల్లల వెంబడి పడటం లేదా అంటుంది. మృదు మాత్రం ఎప్పుడు చదువుకుంటూ వుంటుంది. మృదుల అంటే నాకు బాగా ఇష్టం. ముద్ద మొహం, పొడవాటి ముక్కు. ఎప్పుడు తన వెంట కూర్చొని నేను చదువుకోవాలని అనుకుంటాను. కాని నన్ను ఎవరు చదవనిస్తున్నారు. స్నేహితులతో మాట్లాడుకోవడం, నవ్వుకోవడంలో వున్నంత ఆనందం మా చదువుకోవడంలో లేదు. స్నేహితులు మనకు అర్ధమైయ్యే భాషలో అర్ధమైయ్యే విషయాలు చెప్తారు. మనకు వినబుద్ధి వేస్తుంది. చదువులో సైంటిస్టు తన జీవిత కాలం ధారపోసి సిద్ధాంతాలు, ప్రయోగాలు చెప్తారు. కాని అవి జీవితానికి అన్వయం అయినట్టు వుండవు. అందుకే చదువు పరీక్షల కోసం లాగానే వుంటుంది. మమ్మీయేమో అన్నింట్లో పోటీ వుండాలంటుంది. మృదు తను చదువుకుంటూనే మాతో కబుర్లు చెబుతుంది. షాపింగ్‌కి వెళ్ళడం, సినిమాలకు వెళ్ళడం చాలా సరదాగా వుంటుంది. జంట్స్ స్మూత్‌గా ఏడిపిస్తే మేము పెద్దగా రియాక్ట్ కాము. వాళ్ళు రఫ్‌గా వున్నప్పుడు మాకు బాధవేస్తుంది. ఏదైనా సెలవు వచ్చినప్పుడు ఇంట్లో వుండాలంటే బోరుకొడుతుంది. మా ఇంట్లో కుక్కలు పనిమనుషులు తప్ప ఎవ్వరూ వుండరు. మ్యూజిక్ ఇనుస్ట్రుమెంట్స్ ఎన్నో వున్నాయి కాని ఎవరితోనన్నా కలసి పాడుతున్నప్పుడే సంగీతానికి అర్ధం వుంది. మా మమ్మీకి సిల్క్ చీరల వైరటీల గురించి అపారమైన నాలెడ్జ్ వుంది. ఈ చీరల షాపుల వాళ్ళందరూ జ్యూయలరీ షాపులు కూడా పెట్టారు. మా మమ్మీ ఎన్ని ఆభరణాలు కొందో లెక్కలేదు. నిజానికి అవి అన్ని పెట్టుకోదు కూడా. చాలా పక్కన వాళ్ళకోసం, మోహమాటాల కోసం, షాపుల్లో వాళ్ళు చెప్పే మాటల చాకచక్యంతో కొన్నవే గాని తనకు అవసరం వుండి కొన్నవి తక్కువ. ఎన్ని కొన్నా తనకు తృప్తి లేదు. నన్ను పెట్టుకొమ్మని బలవంతం చేస్తుంది. డాడీ మమ్మీ విషయాలు పట్టించుకోరు. నువ్వు అవి ఎందుకు కొన్నావు డబ్బులు ఎందుకు ఖర్చు పెడుతున్నావు అనరు. ఏదైనా సందర్భంలో చర్చ పెట్టినా ఆమెతో నిలవడం కష్టం. తాను తనకున్న అనుభవం నుండే ఆర్గ్యుమెంట్ చేస్తుంది. నిజానికి డాడీకి ఈ చీరలు, ఆభరణాలు ఇంటి వస్తువులకు సంబంధించిన జ్ఞానం తక్కువే. ఆయన ఫ్యాక్టరీలు, షేర్లు ఆయన ప్రపంచం వేరు. ఆ ప్రపంచం మాకు అసలు అర్ధంకాదు. భూమి సరిహద్దుల్ని చెరుపుకుంటూ వెళ్ళాలనేది ఆయన ఆలోచన. వాళ్ళిదరూ మాట్లాడుకోవడం చూడాలి అదొక అసెంబ్లీ డిస్కషన్‌లాగా వుంటుంది. కాని చాలా ఆశ్చర్యం ఎన్నో వైరుధ్యాలతో వాళ్ళు కలసి జీవిస్తూనే వుంటారు. ఈ కో-ఆర్డినేషన్ నాకు ముచ్చటేసింది. ఏ అభిప్రాయం కలవకపోయినా మనుషులు ఎలా కలసి వుంటారో మా డాడీ మమ్మీలను చూసినప్పుడు నాకు ఆశ్చర్యం గొలిపే విషయంగా వుంటుంది. నిజానికి మా స్నేహితుల్లో కూడా ఎవ్వరికీ అభిప్రాయాల్లో కలయిక లేదు. మా నీత అయితే తాను కొంచెం బ్లాక్‌గా వుంటుంది. ఎవ్వరూ తనను ప్రేమించడం లేదని దిగులు పడుతుంది. మా స్నేహితుల్లో ఎవరికన్నా ప్రేమలేఖలు వస్తే తాను లాక్కొని చదువుతుంది. మా మృదు అయితే ప్రేమ లేదనిచెపుతుంది. ఇది అంతా అబద్దం అని చెప్తుంది. తన తల్లిదండ్రులు కుదిర్చిన

వాళ్ళనే చేసుకుంటాను. ఇవన్నీ కాలేజీ రోజుల్లో ప్రేమలేనని చెప్తూ వుంటుంది. నిజంగా తను రాసే లేఖలు గాని ఫోన్‌లో అటెండ్ చేసే పద్ధతిగాని చూస్తుంటే మనకు తను నిజంగా ప్రేమిస్తుందేమో అనిపిస్తుంది. పాపం తన బాయ్ ఫ్రెండ్ తన కోసం ఎంతో ఖర్చుపెడుతుంటాడు, చదువు మానుకొని తిరుగుతూ వుంటాడు. తాను కూడా ఎంతో ఇన్వాల్వ్ అయినట్టు వ్యవహరిస్తుంది. ఇదంతా చూస్తుంటే ఏది రియాల్టీయో ఏది కాదో నాకు తికమకగా వుంది. మా మృదు నాతో ఇంత సెన్సిటివ్‌గా వుండకూడదే అని చెప్తుంది. పైగా నీవు స్టేట్స్‌లో చదవాల్సిన దానివి అక్కడంతా పైపైనే వుంటారు. 'ఇదంతా లిప్స్ ప్రపంచమే' అని చెప్తూ వుంటుంది. 'ఒకరిని మోసం చేయటం తప్పుకాదా' అని నేనంటే ఇవన్నీ సీరియస్‌గా తీసుకోబాకే ఇదంతా కాలక్షేపం కోసమే అంటుంది. మా కాలేజీలో శ్రవ్య అనే అమ్మాయి ఒక బాయ్ ఫ్రెండ్ చేత మోసం చేయబడి ఆత్మహత్యాయత్నం చేసుకోబోయింది. చివరికి ఆ అమ్మాయి ఎంతో కష్టంమీద బ్రతికిబయటపడింది. ఇక మా స్నేహితులందరూ 'ఎందుకే అంత సీరియస్‌గా తీసుకున్నావని ఏదీ లైఫ్‌లో సీరియస్‌గా తీసుకోకూడద'ని వేదాంతం మొదలు పెట్టారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఏది సీరియస్ ఏది సీరియస్ కాదు అసలు చదువుకోవడానికి వచ్చిన పిల్లలు ఎందుకు ఈ ప్రేమలో పడాలి. అవి ప్రేమలు కాదని ఎందుకు వాదించాలి. అసలు చదువు కంటే కూడా ఈ విషయాల పైనే వీరు ఎందుకు సీరియస్‌గా వుండాలి అని అనే ప్రశ్నలు నన్ను వేధిస్తూ వుంటాయి. ఈ ప్రశ్నలను ఎవ్వరితో పంచుకుందామన్నా వాళ్ళందరూ నవ్వుతున్నారు. నీ వెంటకూడా ఒకడు పడితే నీకు తెలుస్తుందని ఎద్దేవ చేస్తుంటారు. ఒక అమ్మాయి వెంబడి ఒక కుర్రోడు పడితేనే ఆమెకు గుర్తింపు వున్నట్టు వీళ్ళు వాఖ్యానిస్తుంటే నాకు మతిపోతూ వుంటుంది. కాని నలుగురు స్నేహితులను కలసి ఒక గార్డెన్‌లోనో ఒక హోటల్‌లోనో మాట్లాడుకుంటున్నప్పుడు పూటలు గడిచినా మనకు ఒక ఆనందం. అన్ని అభిప్రాయాలు భిన్నంగానే వుంటాయి. ఆ వాదనలో ఆ ఖండనలో ఆ నవ్వులో ఆ సమన్వయాల్లో మనం ఎన్నో అనుభూతుల్ని పొందుతాం. కాని మా స్నేహితులో ఈ స్నేహం కూడా నిజం కాదని వాదిస్తారు. పెళ్లి అయితే నా దిక్కే చూడవని ఒకరు, ఇతర దేశాలకు వెళితే ఫోన్ చెయ్యవని ఒకరు ఆటలు పట్టిస్తుంటారు. ఇక ఇంటికి వస్తే మా మమ్మీ మా స్టేటస్ గురించి, ఆస్తుల గురించి, హోదా గురించి చెప్పిందే చెప్తుంటుంది. అమెరికా వెళ్ళిన వాళ్ళే గొప్పని మా మమ్మీ ఉద్దేశం. రూపాయి తన దృష్టిలో ధనం కాదు డాలరే డబ్బని. మా అన్నయ్యలు ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. వాళ్లకి మా మమ్మీ సంబంధాలు చూస్తుంది. ఫెయిర్‌గా వుండాలి, కోట్ల ఆస్తి వుండాలి, ఇంజనీరింగ్ చేసి వుండాలి, అమెరికా వెళ్ళడానికి సిద్ధమై వుండాలి. మా కులమై వుండాలి, మా ప్రాంతమై వుండాలి. 30మంది బ్రోకర్లకు డబ్బు ఇచ్చింది. వాళ్ళు రోజు ఫోటోలు తీసుకురావడం మా మమ్మీకి నచ్చకపోవడం నన్ను కూడా చూడమని అనడం నువ్వు చూస్తున్నావు కదమ్మా అని నేను అనడం ఇది ఒక పెద్ద చర్చ. మా డాడీకి ఇప్పుడు చూపించను చివరగా చూపిస్తాను అంటుంది. ఆయన కొన్ని విషయాల్లో ఎడ్జస్ట్ అవుతారని మా మమ్మీ ఆలోచన. డబ్బుదేముంది అమ్మాయి ఎడ్యుకేషన్‌ని, ఫెయిర్‌గా వుండడాన్ని చూడమని డాడీ అంటాడు. దేనిలో రాజీపడేది లేదని మమ్మీ అంటుంది. అదేమంటే మీరు పిల్లల్ని పట్టించుకున్నారా నేనే చదివించాను అని మమ్మీ అంటుంది. నువ్వు ఎక్కడ చదివించావు వాళ్ళు రెసిడెన్షియల్‌లో చదువుకున్నారని డాడీ అంటాడు. నీవు ఏమైన స్వయంగా వండిపెట్టావా, తినుబండారాలు పెట్టావా అని డాడీ అంటాడు. మీ మమ్మీ మీకు పెట్టి పెట్టి మిమ్ములను ఇలా తయారు చేసిందిగా అని మమ్మీ అంటుంది. ఇంక రణరంగం. డాడీనే తగ్గుతారు. ఇక నీవు చూస్తే వాళ్ళకు పెండ్లి కాకపోగా వాళ్ళు అక్కడ ఎవరినో ఒకరిని చూసుకొని చేసుకునే పరిస్థితి వస్తుందని అంటారు. నా పిల్లలు అలాంటి వాళ్ళు కాదని మా మమ్మీ అంటుంది. మా అన్నయ్య వాళ్ళు మా మమ్మీ బాటలోనే నడుస్తారు. వారం వారం గంటలు గంటలు మాట్లాడుకుంటారు. ఎప్పుడూ డబ్బు గురించే వాళ్ల సంభాషణ. డబ్బుకు మనిషికి ఇంత బంధం ఏమిటని కూడా నాకొక పెద్ద చర్చ. మమ్మీ డబ్బు ఎప్పుడు ఖర్చు పెడుతూనే వుంటుంది. డబ్బుకు ఎప్పుడూ వెంపర్లాడుతూనే వుంటుంది. నువ్వు తప్పక స్టేట్స్ కెళ్ళాలని అంటుందే తప్ప నువ్వు పెళ్లి చేసుకోవాలని అనదు. నాన్నకు ఆ ఆలోచన వున్నట్టుంది. మా స్నేహితుల్లో చాలా మందికి పెండ్లి చూపులు జరుగుతున్నాయి అన్నప్పుడు మేము సర్దాగా తోడు వెళతాం. ఏదో కొన్ని లక్షలు తగ్గాయని ఆ పెళ్లి ఆగిపోయిందంటే నాకు చాలా బాధేసింది. నిజానికి మా అమ్మంటే మా స్నేహితులందరికి భయం. ఆమె లేనప్పుడు ఇంటికి వస్తుంటారు కాని ఆమె ఎప్పుడూ వాళ్ళు వచ్చాక వస్తూనే వుంటుంది. మా అమ్మ మాట్లాడేప్పుడు ఎదుటివారు బాధపడతారని ఆమెకు వుండదు. ఎదుటివాళ్ళు బాధపడితే కొన్ని సార్లు సంతోషిస్తుంది. అందరూ తిండికి లేక తన ఇంటికి వస్తారనే మనస్తత్వం తనది. తన స్నేహితులకు మాత్రం ఇల్లంతా దోచిపెడుతుంది. తనను పొగిడే వాళ్ళు కావాలి. తనకొక పెద్ద బెటాలియన్ వుంది. వాళ్ళు ఎప్పుడూ మా అమ్మని మీరు అంతటోళ్ళు, ఇంతటోళ్ళని గ్యాసిప్స్ చేస్తుంటారు. నీవన్నీ మీ నాయనమ్మ బుద్ధులే అని తిడతా వుంటుంది మా అమ్మ. మా నాయనమ్మ చిన్నప్పుడు నన్ను వదిలేది కాదట. ఎప్పుడూ సంకనేసుకొని వుండేదట. మా నాయనమ్మ వున్న రోజులో మా ఇంట్లో ఎప్పుడూ బంధువులు చెయ్యి కడిగే వాళ్ళని మా అంకుల్‌వాళ్ళు చెప్తూనే వుంటారు. నాకు గుర్తులేదు కాని మరి మా ఇంట్లో ఫోటోలు చూసినప్పుడు మా నాయనమ్మ ముఖంలో వున్న ప్రశాంతత నాకు ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. ఇన్నీ వున్న మా అమ్మలో ఏదో అసంతృప్తి, ఆదోళన, చిరాకు, ఆరాటం కనిపిస్తాయి.

తనకి ఈ హైద్రాబాదులో వుండే ఆభరణాలన్నీ కావాలని కోరిక. అన్ని బ్యాంకుల్లో అకౌంట్స్ కావాలని, కొత్త కొత్త పథకాల్లో చేరుతూ వుంటుంది. మా అమ్మ డిపాజిట్ చేసిన బ్యాంకులు కొన్ని ఎత్తివేశారు కూడా. ఇవన్నీ మా నాన్న దృష్టికి పోనివ్వదు. ఇన్ని వున్నా ఆమెకు నిద్ర కరువే. సర్వెంట్లని బాగా కసురుకుంటుంది. బ్యూటీపార్లర్‌కి వెళ్ళి ఎంత మేకప్ చేయించుకున్నా మొఖంలో అన్‌రెస్ట్ కనిపిస్తూనే వుంటుంది. మరీ మా అన్నయ్యల పెళ్లి విషయంలో చాలా ఆందోళనగా వుంటుంది. ఆంధ్రదేశంలో మా కులంలో వున్న అమ్మాయిలను వరుసగా నిలబెట్టినా ఆమెకు ఎవ్వరూ నచ్చేటట్టు లేరు. నిజానికి మా అన్నయ్యలు అంత హ్యాండ్‌సమ్‌గా ఏమీ వుండరు. ఒక మోస్తరుగా వుంటారు. ఇక మా స్నేహితులను పరిచయం చేస్తే మీ డాడీ ఏం చేస్తుంటాడు. మీకు ఆస్తి ఎంత వుందని మా మమ్మీ లెక్కల్లోకి వెళుతుంది. అందుకే వాళ్ళు మా మమ్మీ ఎదుటపడటానికి ఇష్టపడరు. మా డాడీ నేను మాట్లాడుకునేటప్పుడు కూడా మా మమ్మీకి అనుమానం. తన గురించి ఏం కామెంట్ చేసుకుంటున్నామో అని తలుపు సందుల్లోంచి వింటూ వుంటుంది. మా డాడీ ఎప్పుడన్నా ప్రేమగా తల నిమిరి నొసటి మీద ముద్దు పెట్టుకుంటారు. అది ఒక్కటే ప్రేమకు సంబంధించిన గుర్తుగా నాకు కనిపిస్తూ వుంటుంది. మా ఇంట్లో అనుబంధానికి సంబంధించిన అంశాలు ఏమీ దొరకవు. కార్లు, డ్రైవర్లు, లాన్స్, గార్డెనింగ్ చేసేవాళ్ళు, కుక్కలు, వాటిని పెంచేవాళ్ల వీళ్ళందరితో మా మమ్మీ అరుస్తావుంటుంది. మా డాడీ ఎవరినీ తిట్టరు కాని మా డాడీ అంటే అందరికి గౌరవం.

ఫైనల్ ఇయర్ వచ్చేసరికి మా స్నేహితులందరూ బిజీ అయిపోయారు. ప్రేమలు కబుర్లు అన్ని మూలన పడవేసి అందరూ చదువులో పడ్డారు. థర్డ్ ఇయర్‌లోనే ట్రోఫెన్ పాసయ్యాను. ఫైనలియర్ వచ్చేసరికి అన్నీ సిద్ధం చేసి పెట్టింది. పాస్‌పోర్టులు, వీసాలు నేను పాస్ అవ్వడం అన్ని జరిగి పోయాయి. ఇక నేను ఈ రోజు అమెరికా వెళుతున్నాను. ఫ్లైట్ టికెట్టు బుక్‌అయింది. అన్నయ్యవాళ్ళు అక్కడ రిసీవ్ చేసుకుంటారు. మార్నింగ్ 5గంటలకు ఫ్లైట్. డాడీ ఇంకా రాలేదు. సహజంగా డాడీ రాత్రులు ఎక్కడా వుండరు. నేను బయలుదేరి వాకిట్లోకి వచ్చాక డాడీ ఎదురుబడ్డారు. వృద్ధాశ్రమంలో తాతయ్య చనిపోయాడని తాతయ్యని విలేజికి తీసుకెళ్ళాలని డాడీ చెప్పారు. మా మమ్మీ ఒక నిట్టూర్పు నిట్టూర్చి పదపద అంటుంది. నా కాళ్ళు కదలలేదు. డాడీ దగ్గరికి వచ్చి మళ్ళీ నా తల భుజానికి ఆనిచ్చుకున్నాడు. నాకు కన్నీళ్ళు వచ్చాయి. నేను ఎటువైపు వెళ్ళాలో డాడీ నిర్ణయించలేని స్థితిలో వున్నాడు. నేను నిర్ణయించుకోలేని స్థితిలో వున్నాను. అప్పుడు మమ్మీ ఆజ్ఞ ఏదో వినిపించింది....నా పాదాలు మొద్దుబారి అనుసరించాయి....

★

మానవ మనస్తత్త్వాల సమాహారం

డాక్టర్ రావూరి భరద్వాజ రచనలంటేనే సమాజాన్ని ఆసాంతం అధ్యయనం చేసి అందించేవే. తన 'పాకుడురాళ్ళు' లో ఆయన సినీ ప్రపంచంలో నటీనటులుగా తెరమీద మెరవాలంటే ఎన్ని ఇబ్బందులు పడాలో, కొన్నిసార్లు మనస్సును చంపుకొని ఎంతగా దిగజారాలో మనకు కళ్ళకు కట్టారు. ఈ 'కాదంబరి' నవలకు వచ్చేసరికి మనకు సమాజంలోని విభిన్న మనస్తత్త్వాలు, వారి స్వభావాలను వివరించారు. ఒక్కో పాత్రా ఒక్కో రకమైన స్వభావంతో మనకు కన్పిస్తుంది. వీటితోపాటు పెట్టుబడిదారీ సమాజపు సంకుచిత, దుష్ట స్వభావం కూడా ఇందులో మనకు అవగతమవుతుంది. ఇందులోని రామకృష్ణయ్య గర్భదారిద్ర్యంలో పుట్టి కోట్లకు పడగలెత్తుతాడు. ఆ స్థితికి చేరాలంటే తాను ఎంత కష్టపడిందీ, ఏరకమైన పైరవీలు చేసిందీ, రాజకీయ నాయకులు, అధికారులను ఎలా మచ్చిక చేసుకుందీ ఆ పాత్ర ద్వారా మనకు రచయిత చెప్పిస్తారు. ఇందులో ఉన్న అన్ని పాత్రల స్వభావాలూ మనకు మన చుట్టూ కన్పిస్తూనే ఉంటాయి. వ్యాపారులు, పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు ఏ విధంగా కుమ్మక్కై ప్రజల సంపదలను దోచుకుంటారో ఇందులోని కొన్ని సంభాషణలను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. 'రాజకీయాలకు, వ్యాపారాలకూ దగ్గర సంబంధాలుంటాయని ఎవరన్నా అంటే ఒకప్పుడు రామకృష్ణయ్యకు అర్థమయ్యేదికాదు. ఈ సత్యాన్ని తొలిసారిగా ఆయన చంద్రశేఖరంగారి నుంచి తెలుసుకున్నాడు. అధికార వర్గాలవారికి 'ముడుపు' చెల్లిస్తూనే చంద్రశేఖరంగారు 'పెద్దదేవత'లను ధ్యానం చేస్తూ ఉండేవాడు'. అలాగే రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు తెరవెనుక నడిపే తతంగాలనూ ఇందులో మనకు వివరించారు. 'ఆ సంగతి చెప్పడానికే వచ్చాం! మీటింగుల్లో నిన్నూ, ముఖ్యమంత్రినీ తిడతా. కొంపదీసి అయ్యన్నీ నిజమనుకోబాక. అట్టాగే మీరు కూడా మమ్మల్ని ఎడాపెడా వాయించండి. మేమూ ఏమీ అనుకోం. సరేగదా?', 'ఇప్పటి దాకా మనమనుకొన్నదంతా మీరు మర్చిపోయారు. ఈ నిముషం నుంచీ మీరూ, మేమూ విరోధులం. మేం మయూరాక్షి ప్రాజెక్టును గురించి మీతో సంప్రదింపులు జరపడానికొచ్చాం. మన సంభాషణలు విఫలమయ్యాయి. ప్రజాప్రతినిధులమైన మేము ఎంతగా నచ్చజెప్పినా, ప్రభుత్వం తరఫున చర్చల్లో పాల్గొన్న మీరు మంకు వదలలేదు. చర్చల మధ్యలోంచి మేం లేచి వెళ్ళిపోతున్నాం'. ఇంకా ఇందులో రామకృష్ణయ్య అల్లుడు శంకరం పేద రైతులకు సేవ చేయాలనే ఉద్దేశంతో మయూరాక్షి ప్రాజెక్టు ఆమోదింపచేసేందుకు ఎంతగానో కృషి చేస్తాడు. చివరికి ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజనీరుగా పని చేస్తుంటాడు. ఆయన అక్కడ జరుగుతున్న అవకతవకలను గురించి ఆవేదనతో జగన్నాథంతో ఇలా చెబుతాడు. 'మీరూ, మీ దేశమూ ఏ మట్టిలో కలిసిపోతే ఎవడిక్కావాలి జగన్నాథంగారూ? మా భోషాణాలు నిండాయా, లేదా? మావాళ్ళ భోషాణాలు నిండాయా, లేదా? మా వాళ్లంతా కట్టుకుపోయినంత సంపాదించుకొన్నారా, లేదా? సుఖంగా ఉంటున్నారు గదా! అయితే మరింకేం. మొత్తం మీద దేశం సుఖంగా ఉన్నట్లే లెక్క!', 'ఎందుకురాడు జగన్నాథంగారూ! రాకపోవడానికి నామీదేమన్నా కోపమా? పోనీ శంకరం మీద కోపమున్నదా? ఒకవేళ ఉన్నా దాన్ని లోలోపల దాచుకొంటాడే తప్ప పైకి వెళ్ళగక్కడు. అందువల్ల ఏదో ఒక ప్రయోజనం ఉంటే తప్ప ఆయన వ్యాపారస్థుడు. ఎప్పుడు ఎవరితో స్నేహం చేయాలో, ఎవరితో విరోధం పెట్టుకొన్నట్లు కనిపించాలో ఆయనకు బాగా తెలుసు. మీతో చెప్పాననుకొంటా సరస్వతీ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ పేరు మీదుగా ఆయనా, బసవపున్నయ్యా కలిసి ఓ కంపెనీని ప్రారంభించారని! వాళ్ళే ఇక్కడి మేజర్‌వర్క్సు చేస్తున్నారు. శంకరంగారేమో ఇంజనీరాయె! ఆయనతో రోజూ సవాలక్ష పనులుంటాయాయె! అందుకోసమన్నా నాన్నగారు మాతో సఖ్యంగా ఉండక తప్పదు' అన్నది కౌముది చిరచిరలాడుతూ. ఇందులో ఇలాంటి సంభాషణలెన్నో మనకు కన్పిస్తాయి. పుస్తకం ఆసాంతం చదివిస్తుంది.



రచయిత : డా॥రావూరి భరద్వాజ,
వెల : రూ.80.
పేజీలు : 164
ప్రతులకు :
అన్ని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు.

-సింహాద్రి సరోజిని



కొలిమి
తెలంగాణ కవిత
వెల : 100/-
పేజీలు : 160
ప్రతులకు
నియోగి
7-101, టివిఆర్ వీధి,
సత్తుపల్లి - 507303
ఖమ్మం.



దళిత మహా కావ్యం
ఆత్మ గౌరవ స్వరం
డా॥కత్తి పద్మారావు
తెలంగాణ కవిత
వెల : 150/-
పేజీలు : 388
ప్రతులకు
కత్తి స్వర్ణకుమారి
లోకాయుత ప్రచురణలు
అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు
గుంటూరు - 522124
మరియు
అన్ని ప్రముఖ పుస్తక షాపులు.



నవ్వుల్ - పువ్వుల్

వాస్తవం...భ్రమ

టీచర్ : రామూ! వాస్తవానికి భ్రమకి తేడా చెప్పరా!

రాము : టీచర్! మీరు పాఠం చెప్పడం వాస్తవం. కాని అది మేము వింటున్నామని అనుకోవడం మీ భ్రమ.

కోడి

టీచర్ : బంటీ! కోడి గురించి రెండు విషయాలు చెప్పు.

బంటి : కూస్తే అలారం, కోస్తే పలహారం

కడుగు

భర్త : ఏమేవ్! బియ్యం బాగా కడిగి అన్నం వండు సరేనా!

భార్య : అలాగేనండి.....

భర్త : ఏమేవ్! అన్నం సబ్బు వాసన వస్తోందేంటి?

భార్య : మీరే కదా బియ్యాన్ని బాగా కడిగి అన్నం వండమన్నారు.

భర్త : అవునే! మరి ఏం చేశావు?

భార్య : ఏం లేదండీ వాటిని "రిన్" వేసి కడిగానండి.

-నవీన్, నాగరాజు, విష్ణువర్ధన్, పేర్నమిట్ట.

దేవుడు చూస్తున్నాడు

(హెడ్ మిస్ట్రెస్ గది ముందర యాపిల్ పళ్లు, బిస్కెట్లు బుట్టల్లో పెట్టారు. పిల్లలంతా వరుసలో వచ్చి తీసుకుంటున్నారు)

టీచర్: ఊ...ఒక్క యాపిల్ పండే తీసుకోవాలి. చూడండి అక్కడ ఏం రాసుంది? దేవుడు చూస్తూనే వుంటాడు అని. అందుకే చెప్పినట్టు చేయాలి.

టింకు: యాపిల్ పండ్లను దేవుడు చూస్తున్నాడు కాబట్టి ...బిస్కెట్లు ఎన్నయినా తీసుకోవచ్చా టీచర్?

వడ పోస్తా

కస్టమర్ : ఈ ఊళ్లో...మీ హోటలే...చాలా బెటరయ్యా. కాఫీలో ఈగలు, దోమలు, బొద్దింకలు రావడం నేనెప్పుడూ చూడలేదు.

సర్వర్ : మీరొచ్చే ముందు శుభ్రంగా వడపోసి తెస్తా గదండి మరి.

జీవితాశయం

విలేకరి : మీరు వర్ధమాన గాయకులు కదా! మీ జీవితాశయం ఏమంటారు?

గాయకుడు : పాడేటప్పుడు ప్రాణం పోవాలని.

విలేకరి : ఎవరి ప్రాణం? (మనసులో)

తప్పు చేశా

భర్త : పక్కింటాయన అడిగినప్పుడల్లా డైలీ పేపర్ ఇవ్వడం పెద్ద తప్పయిపోయింది.

భార్య : ఏమయిందండీ?

భర్త : ఇప్పుడు వార్తలు చూసిస్తానని టీవీ ఇవ్వమంటున్నాడు.

-వై.కె.మూర్తి, విజయవాడ.

నిజాయితీ

(ఇద్దరు పిల్లలు మాట్లాడుకుంటుంటారు)

మొదటివాడు: హాయ్! నాపేరు టామ్.

రెండవవాడు: నాపేరు రామ్.

మొదటివాడు: మా నాన్న అకౌంటెంట్. మరి మీ నాన్నో...

రెండవవాడు: లాయర్.

మొదటివాడు: నిజాయితీపరుడేనా!

రెండవవాడు: ఆ...మీ నాన్నలాగే.

నిర్ధారణ

(ఒక న్యాయవాది అంత్యక్రియలు జరుగుతుండగా పరామర్శించడానికి ఒక్కసారే గుంపుగా వస్తారు)

వ్యక్తి: ఓ...ఇంతమంది వచ్చారే.

పరాయివ్యక్తి: ఆ...మేమంతా లాయరుగారి క్లయింట్లం.

వ్యక్తి: అవునా! ఇందరు రావడం మంచిదే.

పరాయివ్యక్తి: మరి ఆయన నిజంగా చనిపోయారో లేదో నిర్ధారించుకోవడం మంచిది కదా.

- కె.వీరేంద్ర, ఒమ్మెవరం.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

ఏమా పదం?







ఎవరబ్బా...

ఈ గుండ్రటి రాళ్లలో ఎవరో దాక్కున్నారు. వారెవరనేది కనిపెట్టాల్సింది మాత్రం మీరే. కాకపోతే ఒక సూచన. ఒక చుక్క వున్న రాళ్లకు నలుపు రంగు అద్ది చూడండి.

కత్తిరించి...అతికిద్దాం

హాయ్ నేస్తాలూ... మీకు ఏదైనా బొమ్మను బాగుచేయడమంటే చాలా ఇష్టమంటకదా. ఇదిగో ఇక్కడ చిరిగిపోయిన బొమ్మ ముక్కలున్నాయి. వాటిని మీరు బొమ్మగా అతికించాలి. ఎలాగబ్బా... అని బుర్ర గోక్కోకండి. ముందు ఈ పజిల్ మొత్తాన్ని ఒక పల్చటి అట్టమీద అతికించండి. బాగా ఎండిపోయాక ఏ ముక్కకాముక్కను కత్తిరించండి. ఇప్పుడు వీటిని ఎలా అతికిస్తే బొమ్మ తయారౌతుందో చూసుకోండి. ఆ తర్వాత అతికించేయండి. అంతే. బాగా కష్టంగా అనిపిస్తే మా జవాబు చూడండే.



చుక్కలు కలిపేస్తే పోలా

హేయ్ చిన్నారులూ... ఈ చుక్కల్లో దాక్కుని మిమ్మల్ని ఆటపట్టిస్తున్నదెవరో తెలియాలంటే ఏం చేయాలి? చుక్కలు కలిపేయాలి. మరి ఇంకెందుకు ఆలస్యం? 1 నుంచి 99 వరకు వరుసగా చుక్కలు కలిపేస్తే పోలా!





నాలుగో నేస్తం

పిల్లలూ! ఇక్కడ నలుగురు స్నేహితులు కలుసుకుందామనుకున్నారు. గుర్రం, పిల్లి, పురుగు వచ్చేశాయి. నాలుగో నేస్తం కోసం ఎదురుచూస్తున్నాయి. వాస్తవానికి ఆ ఎదురుచూస్తున్న మిత్రుడు కూడా అక్కడే వున్నాడు. మీకేమైనా కనిపించాడా? లేదా! మరి మాకు కనిపిస్తున్నాడేంటి? మేం చెప్పినట్టు చూస్తే మీకూ కనిపిస్తాడు. ముందు ఈ బొమ్మను జాగ్రత్తగా కత్తిరించండి. తర్వాత ఇదిగో బొమ్మ మీద గీతలున్నాయి కదా. ఆ ప్రకారం పేపరును మడతపెట్టి చూడండి. కనిపించేస్తాడు.

అంతరిక్ష నౌక వెళ్లేదెలా?

బుడుగులూ! మన అంతరిక్ష నౌక ఏలియన్ షిప్‌లోకి వెళ్లాలి. కానీ అక్కడో ఏలియన్ అడ్డంగా కూర్చుంది. మరి దాన్ని దాటుకుని ఏలియన్ షిప్‌లోంచి బయటకు రావాలంటే ఎలా?





ఏ వాహనం ఎవరిది?

ఏనుగు, సింహం, కప్ప...ఎవరు ఏ వాహనాన్ని నడుపుతారో చెప్పండి.

మాటల కోట - 17

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1		2	3	4	■	5		6
	■	7			■		■	
■	8	■		■	9	■	10	
11		12	■	13		■		■
	■	14	15	■		16	■	17
	■	18			■	19	20	
21	22	■		■	23			■
24		25	■	26	■		■	27
■	28					■	29	

నిలువు

1. ఇబ్బంది పెట్టే పెద్ద మోత (2)
2. తీగ, కిందనుంచయితే జీవాల్లో ఇదే ప్రధానమయినది (2)
3. కోట ప్రహరి (3)
4. కింద నుండి దిబ్బ (2)
5. పూవు (2)
6. అతి చల్లదనం (3)
8. ఉత్తరం (2)
9. పోకిరి (3)
10. ఇంటికప్పుకు వినియోగించే గట్టి తుంగ, దేశంలో తలభాగంలో ఉన్న రాష్ట్ర రాజధాని (2)
11. గీతలు ఉండని పేదరికపు గీత (5)
12. తస్కరించడం (3)
15. ఇంద్రుడి వనం (3)
16. గీతల బొమ్మ (4)
17. ఆలుమగలులో బంగాళదుంప (2)
20. మర, రెండు ఎముకల కలయిక స్థానం (2)
22. అనబోడని కిందనుండి హామీ ఇవ్వండి (3)
25. కిందనుండి పైకొచ్చిన ప్రజలు (2)
26. ఇది కాటేసిందంటే డెంగీ, మలేరియా, చికున్‌గున్యాలలో ఏదో ఒకటి సోకిందన్నమాటే (2)

అడ్డం

1. అందరూ శాకాహారులే గానీ ఇది మాత్రం మాయమయిందట (5)
5. స్వాతంత్ర్యానికి ముందు స్వదేశీ ఇప్పుడు (3)
7. తక్కువగు (3)
10. నీరే (2)
11. రుజువు (3)
13. సన్నం కాదు కాకపోతే అడ్డం తిరిగింది (2)
14. గొప్ప (2)
16. తిరగబడిన రాత్రి (2)
18. నమస్కారం (3)
19. వీళ్లను చాటుమాటుగా మామలని పిలుచుకుంటారు (3)
21. రాజు (2)
23. ఇక్కడ ఎటెటో ఎగిరిన ఆ పక్షి ఏ గూట్లో వుంటే ఆ గూటి పలుకులు పలుకుద్దని నానుడి (3)
24. పుడ్చటం, మనిషి ప్రస్థానంలో ఇదే చేస్తారు (3)
28. చావులేని (5)
29. స్నేహం (2)

మాటలకోట - 16 జవాబు

1 బా	పు	■	2 పు	డ	3 క	■	4 వా	5 గు
వ	■	6 కొ	న	■	7 ను	8 సి	■	హ
■	9 ణి	త	రు	■	10 క	వం	ర	■
11 ఉ	■	12 ర	క్తి	■	13 ట్టు	గి	■	14 సం
15 గా	యం	■	■	16 అ	■	■	17 తి	క్రాం
ది	■	18 వే	19 లు	■	20 ఆ	21 కు	■	తి
■	22 ద	న	వే	■	23 క	రు	వు	■
24 తా	■	25 మ	ది	■	26 తా	లు	■	27 సం
28 ళం	మే	■	29 ప	రా	యి	■	30 మం	దు



ఐకమత్యమే ఆనందం

ఒక అడవిలో చక్కటి పక్షుల సంగీత బృందముంది. ఆ బృందంలో నెమలి, చిలుక, వడ్రంగిపిట్ట, డేగ, కోయిల, గువ్వ, పావురం, గోరువంక, గద్ద... వుండేవి. అవెంతో కలిసి కట్టుగా ఉండేవి. నెమలి నాట్యం చేసేది. చిలుక యాంకరింగ్ చేసేది. పావురం సన్నాయి వాయించేది. వడ్రంగి పిట్ట డోలు కొట్టేది. డేగ హార్మోనియం వాయించేది. కోయిల చక్కగా పాటలు పాడేది. గువ్వ, గోరువంక పాటకు కోరస్ పాడేవి. జట్టంతటికి మేనేజర్‌గా గద్ద ఉండేది. అది పెళ్లి ఇళ్లకు పోయి, డబ్బు ఒప్పందం చేసుకుని వచ్చేది. అవి అడవంతా మనోరంజకంగా ప్రోగ్రాంలిస్తూ, పక్షుల్ని జంతువుల్ని అలరింపజేస్తూ, పొట్టపోసుకునేవి. వాటి ప్రదర్శన ఉందంటే అడవిలోని పక్షులు, జంతువులన్నీ పోలోమంటూ వచ్చేవి. తనివితీరా చూసి ఆనందంగా వెళ్లేవి.

ఒకనాడవి పిచ్చుకమ్మ పెళ్లికి వెళ్లాయి. ఎంతో చక్కగా తమ సంగీతంతో, నృత్యంతో వచ్చిన వారిని ఆనందింపజేశాయి. చివరకు భోజనాలు వడ్డించి అందరికీ తృప్తిగా పెట్టసాగింది పిచ్చుక. ఆ బంతిలో కూర్చున్న పాలపిట్ట...

"ఇవాళ్టి ప్రదర్శనలో, నీ నృత్యం చాలా అద్భుతంగా ఉంది. నెమలమ్మా నీకు అభినందనలు" అంది.

దాని ప్రశంసతో పొంగిపోయిన నెమలి

"మీరే కాదు. అందరూ నన్నెంతో మెచ్చుకుంటారు. నేను ప్రతి ఫంక్షన్‌లోనూ గొప్పగా నృత్యం చేస్తాను" అంది.

ఆ సంభాషణతో పక్కనున్న మిగతా పక్షులన్నీ చిన్నబుచ్చుకున్నాయి.

"ఆ పాటను హార్మోనియం మీద కంపోజ్ చేసింది నేను. అందులో నా గొప్పదనం కూడా ఉంది" అంది డేగ.

"అసలా పాట రాసింది నేను. సాహిత్యం కూడా గొప్పగా కుదిరింది. వర్ణనలు అద్భుతంగా పండాయి. దాన్ని రాయడం కోసం, నిద్ర లేని రాత్రులెన్నో గడపాల్సి వచ్చింది" అంది మైనా.

"మేం కోరస్ పాడకుంటే, ఆ పాటకంత అందమొచ్చేదే కాదు" అన్నాయి గువ్వ, గోరువంక.

"ముందు నేను యాంకరింగ్ చేసి, సభికులను ఆకట్టుకోపోతే, అంత జనం ఉండేవాళ్లే గాదు" అంది చిలుక.

"ఎంత పాడినా, మా డోలు, సన్నాయి లేకుంటే రక్తి కట్టదు. మేమే గొప్ప" అన్నాయి వడ్రంగి పిట్ట, పావురాయి.

"ఇవన్నీ వట్టి అడవి మూకలు. వీటిని ఒక చోటకు చేర్చి, కచేరీలు చేయించడం, పెళ్లిళ్లకు వాయించడం చేస్తున్నానంటే... ఎంత కష్టమో అనుభవిస్తేనే తెలుస్తది. అసలు ఈ ప్రోగ్రాం గొప్పదనం అంతా నాదే" అంది గద్ద.

పక్షులన్నీ బిలబిలమంటూ లేచాయి. "నీదేం గొప్ప, నాది గొప్ప" అని అన్నీ తగాదా పడ్డాయి. పంతానికి పోయి, దేనికదిగా విడిపోయాయి.

సంగీత బృందం విచ్ఛిన్నమైపోయింది. పక్షుల సంగీత కచేరీ లేకున్నా, పెళ్లిళ్లు, పేరంటాలు జరుగుతూనే వున్నాయి. పక్షుల బృందం తగాదాతో విడిపోయిందని తెలిసి, ఎవరూ వాటిని సంప్రదించడం లేదు. పక్షులు ఊరికే గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవలసి వచ్చింది. దాంతో వాటికి ఇల్లు గడవడం కష్టమైపోయింది. ఉపవాసాలు వుండవలసిన పరిస్థితి ఎదురైంది. చివరకు ఆకలికి తట్టుకోలేక, నెమలి, చిలుక విడివిడిగా వెళ్లి తమను ఆహ్వానించవలసిందిగా కోరాయి. కాని సంగీత బృందం మొత్తం ఉంటేనే కళ్లకు, చెవులకు ఆనందమన్నాయి. విడిపోతే బతకడం ఎంత కష్టమో అర్థమైంది. వాటికి తాము చేసిన తప్పు తెలిసి వచ్చింది. ఇతరుల గొప్పదనాన్ని గుర్తించి, అభినందించాలి. తమ గొప్పను ఎదుటివారు గుర్తించాలి. కాని, మనకి మనం గర్వపడకూడదని తెలుసుకున్నాయి. పక్షులన్నీ తిరిగి కలుసుకున్నాయి.

గర్వం వల్ల గుర్తింపును కోల్పోవడమే కాదు. ఆకలితో మాడి చావాల్సి వస్తుందనే నిజం గ్రహించాయి. "ఒకరికంటే ఒకరు ఎక్కువ కాదు, తక్కువా కాదు. అందరమూ సమానమే. తప్పెటకొట్టే పికిలి పిట్ట కూడా గొప్పదే. దేని పాత్ర అది పోషిస్తేనే, ప్రోగ్రాం రక్తి కడుతుంది" అని పక్షులన్నీ ఏకగ్రీవంగా ఒప్పుకున్నాయి. మరింకెప్పుడూ తగాదా పడకూడదని నిర్ణయించుకున్నాయి. మళ్లీ పక్షుల గానాలతో, సంగీత సమ్మేళనాలతో అడవి కళ కళ లాడసాగింది.

-పుప్పాల కృష్ణమూర్తి



కేకో కేక

నోరూరించే కేకులు నవరూపమెత్తి మనముందర నిలిస్తే! కేకో కేక. ఇప్పుడు మనముందు కన్పిస్తున్నవన్నీ కేకులే. ఏంటీ మావన్నీ వుత్తుత్తి కేకలేనా?! ఇలాగైతే నిజంగానే కేకలేయాల్సి వస్తుంది సుమండీ. మనిషన్నాక మరీ అంత కాక పనికిరాదుగానీ...కూసింత మనసుపెట్టి చూడండి. బట్టలు కుట్టే మిషన్, టైప్ రైటర్, డబ్బు లెక్కబెట్టే యంత్రం, సైన్సు పుస్తకం, దంతాల సెట్టు, సోలార్ సిస్టమ్, పెప్సీ టిన్నులు, ఏరియల్ రూట్ మ్యాపు... అన్నీ అచ్చమైన వాటిలాగా అనిపిస్తున్నా కేకులేనని తెల్సిపోయిందా! ఇప్పుడేమనిపిస్తోంది? ఆనందంతో కెవ్వుమని కేక పెట్టాలనిపిస్తోందా! అడ్డేముందీ కానిచ్చేసేయండి.

ఊ...కేకులే కదా అని తీసిపారేయకుండా ఒక నిమిషం ఆలోచించండి. ఇలా కేకులనే నిజమైన వస్తువుల్లా నమ్మించడం అంత సులభం కాదుకదూ. చాలానే కష్టపడి వుంటారు. ఇష్టమైతే అంతేనండీ. ఎంత కష్టమైనా పడతారు. సాధిస్తారు. మనం మాత్రం తక్కువ తిన్నామా? ప్రతిభను ప్రదర్శిస్తే ప్రశంసించకుండా వుంటామా!